ఆదివారం

ప్రజాశక్తి

అక్టోబర్ 17, 2004

దసరా

మా ఊళ్ళో సరదా

హ్యాపీ బర్త్‌డే

(17-10-2004 నుంచి 23-10-2004 వరకు)

సాయి ఆశిష్
1సం॥, 17.10.2003
సుశీల-ప్రభాకర్
ఎ.ఎస్. రావు నగర్-హైదరాబాద్

హర్ష
9సం॥, 17.10.1995
రమ-గణేష్
హైదరాబాద్

హరిణి
8సం॥, 17.10.1996
రమ-గణేష్
హైదరాబాద్

వేణుగోపాల్
1సం॥, 17.10.2003
రజని-కృష్ణ
కాచిగూడ-హైదరాబాద్

రావిపూడి లావణ్య
అక్టోబర్-17
తులసి-శ్రీనివాస్
తేగడ-ఖమ్మం

గట్టు సాయిచరణ్
1సం॥, 17.10.2003
సుజాత-శ్రీనివాస్
జనగాం-వరంగల్

సాయిచరణ్-మేఘన
1సం॥, 17.10.2003
ధనలక్ష్మి-సీతారాములు
జఫర్‌ఘడ్-వరంగల్

సిరివెన్నెల
1సం॥, 17.10.2003
లలిత-వేణుగోపాల్
ఖమ్మం

జ్ఞానేశ్వరరెడ్డి
1సం॥, 17.10.2003
నాగేశ్వరీదేవి-నారాయణరెడ్డి
నంద్యాల-కర్నూలు

నీహారిక
4సం॥, 18.10.2000
పద్మ-బాలకాశి
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

జయంత్ కుమార్
1సం॥, 17.10.2003
సరోజిని-ఉపేంద్ర
రాజ్యలక్ష్మీపురం-విజయనగరం

వి. నందిని
1సం॥, 18.10.2003
జయలక్ష్మి-బాబురావు
సంగారెడ్డి-మెదక్

ఎ. ఆకాశ్
2సం॥, 19.10.2002
సుజాత-సోమశేఖర్
శ్రీకాకుళం

ఎన్. వెంకటేశ్వర్లు
అక్టోబర్-20
చంద్రకళ-సత్యనారాయణ
రావినూతల-ఖమ్మం

కొమ్ము హేమాచందర్
1సం॥, 20.10.2003
లక్ష్మి-సతీష్
నల్లగొండ

కె.జయకృష్ణ
9సం॥, 20.10.1995
జయలలిత-మురగారెడ్డి
తిమ్మాపురం-చిత్తూరు

జి. శ్రావణి
1సం॥, 20.10.2003
జ్యోతి-కృష్ణ
జిన్నారం-మెదక్

వి. ప్రణయ్
1సం॥, 20.10.2003
రత్నకుమారి-చక్రవర్తి
విజయవాడ

ఒ.జయశ్రీ
3సం॥, 21.10.2001
ఇందిర-వేణు
హైదరాబాద్

మరి కొన్నిఫొటోలు మూడవ కవర్ పేజీలో చూడండి

లీడర్స్ మెయిల్



వివరణాత్మకం

3వతేది సంచిక కవర్‌స్టోరీ 'కాలుష్యం...కాలుష్యం' వివరణాత్మకంగా ఉంది. హైటెక్ నగరంగా పేరుగాంచిన హైదరాబాద్‌లో వాయుకాలుష్యం తారాస్థాయిలో ఉండడం ఆశ్చర్యంతో పాటు ఆందోళనను కలుగజేస్తున్నది. ద్విచక్రవాహనాల స్థానం కాలుష్యం పెంచడంలో ముందుందని, రెండవస్థానంలో త్రీవీలర్స్, ఆ తరువాత ఫోర్‌వీలర్స్ ఉన్నాయని ఈ వ్యాసం వివరించింది. కేవలం వాహనాల ద్వారానే కాకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిన్న, పెద్ద పరిశ్రమలు సైనేడ్‌తో సమానమైన వాయువు కార్బన్ మోనాక్సైడ్‌ను విడుదల చేసి, ప్రాణాపాయాన్ని సృష్టించడం ఆందోళనను కలిగిస్తున్నది.

–ఎం డి ముస్తఖీమ్, కొల్లాపూర్,
మహబూబ్‌నగర్‌జిల్లా.

బాగుంది

నగరాలలో రోజురోజుకీ పెరిగిపోతున్న కాలుష్యంచేత అనేక వ్యాధులకు గురవుతున్నారు. నగరీకరణ, పారిశ్రామికీకరణే వాయు, వాహన కాలుష్యాలకు ప్రధానకారణాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేకపోతోంది. నగరాలలో వున్న పరిశ్రమల నుండి వెలువడే వ్యర్ధపదార్థాలు, ముఖ్యంగా రాజధాని నగరం, రామగుండం పట్టణంలో ఉన్న పరిశ్రమలు దీనికి కారణభూతమవుతున్నవి. ఆరోగ్యం పేజీలో 'ఆహారంలో విషం కల్తీ' చదివిన తర్వాత ఆహారం విషపూరితం కావడానికి గల కారణాలు, ఆహారం కల్తీ కాకుండా ఎలాంటి సూచనలు పాటించాలిలాంటి విషయాలు మా పాఠశాల విద్యార్థులకు చదివి వినిపించాను.

–కామిడి సతీష్‌రెడ్డి, టీచర్,
జడలపేట, వరంగల్‌జిల్లా

కథ చాలా బాగుంది

'అందమైన నెమలి' కథ చాలాబాగుంది. పేదవాడు అయిన సింహాచలం తన కొడుకు తనలాగ వేటకు వెళ్ళకుండా ఉన్నత చదువులు చదివి పేదప్రజలకు ఉపయోగపడేవాడు కావాలనుకున్నాడు. ఉన్నత హోదాలో ఉన్న ఆసామి అతనిని, అతని ఆకాంక్షను ఎలా ఉపయోగపెట్టుకున్నదీ చాలా చక్కగా కథలో వివరించారు. ఉన్నవాడికి లేనివాడికి తేడా ఏవిధంగా ఉంటుందో ఈ కథ చాలా హృద్యంగా వివరించింది. రాజకీయవేత్తలు తమ పదవికోసం మన జాతీయపక్షి నెమలిని వేటాడి, విందుచేయడానికి వెనుకాడరని రాసిన రచయితకు ధన్యవాదాలు. ఇలాంటి కథలు విరివిగా ప్రచురించండి.

–రణబోతు వీరారెడ్డి,
జెర్రిపోతుల గూడెం, నల్గొండజిల్లా

పరిమళించిన గోపాలం

కళాసాహితిలో ప్రచురించిన 'పరిమళించిన గోపాలం' లో బి గోపాలంగారి గురించి చాలా చక్కగా రాశారు. సంగీత దర్శకునిగా, గాయకుడిగా సినీరంగంలో తనకంటూ ఒక అగ్రస్థానాన్ని సంపాదించుకున్నారు. తనవైన మధుర బాణీలతో, స్వరాలతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకున్నవారు గోపాలంగారు. భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన స్వరాలు బ్రతికినంతకాలం చిరస్మరణీయుడే.

–మేడూరి సత్యనారాయణ,
హైదరాబాద్

నిన్న...గాంధీకి జై

'మనలో మాట'గా 'నిన్న గాంధీకి జై' బాగుంది. నిన్న గాంధీ జయంతి, ఇవాళ కొత్త సారా జయంతి, న్యూ ఎక్సైజ్ కాలెండర్, సారా హుషార్!! అనే మాటలు నడుస్తున్న (అ)ప్రజాస్వామిక, దౌర్భాగ్య మన భారతదేశ 'ప్రసాదు'(ప్రభుత్వ సారా దుకాణాలు)కి అద్దంపట్టింది.

–సిరిపురపు రామకోటేశ్వర రావు,
ఎనికేపాడు, విజయవాడరూరల్

కవర్‌పేజీలాగా కలర్‌లో...

కవర్‌పేజీలా కొన్ని లోపలిపేజీలు కూడా కలర్‌లో వేస్తే బాగుంటుంది. చూడగానే ఎంతో ఆకర్షించే కవర్‌పేజీ ప్రజాశక్తి సొంతం. కవర్‌పేజీ చూడగానే ఆదివారం అనుబంధం చదవాలనిపిస్తోంది. వారం వారం కవర్ పేజీ హైలైట్‌గా ఉంటోంది. 26వ తేదీ సంచికలో అమెరికా ఎన్నికలకు సంబంధించి 'ఉగ్రరాజ్య ఎన్నికలు' అన్న టైటిల్, వ్యాసం ఎంతో విషయప్రాధాన్యాన్ని కలిగి విశ్లేషణాత్మకంగా ఉంది. 'ఔరా' శీర్షికన ఆశ్చర్యపరచే అంశాలు బాగున్నాయి. ఆరోగ్యం శీర్షికన 'చర్మవ్యాధులు' కి సంబంధించిన వ్యాసం, 'బక్కుల గారు'(రియల్‌స్టోరీ)వ్యాసం, 'అమెరికా పాఠం' పుస్తకపరిచయం, టూరిస్ట్‌గైడ్ అన్నీ బాగున్నాయి.

–గరిడేపల్లి ప్రసాదరావు,
బుగ్గపాడు, ఖమ్మంజిల్లా

అప్పిచ్చువాడు.....

ఆ మాటెవరన్నా అనంగానే దానిని వెంటనే పూరించేస్తాం వైద్యుడు అని. కొన్ని సామెతలు అలా సాహిత్యపు ఆస్తిలా... కేవలం మాటవరసకేనన్నట్టు స్థిరపడిపోయాయి.

ఎప్పుడూ పారే సెలయేరు, అప్పిచ్చే వైద్యుడు లేని ఊళ్ళో ఉండకూడదురా అని కూడా వెనుకటి రోజుల్లో శలవిచ్చారు పెద్దలు.

ఇటీవల నా ఫ్రెండొకడు అప్పిస్తావా అని నేరుగా అడగడానికి సిగ్గేసి ఏరా వైద్యుడు పోస్టు ఇస్తాను...చేస్తావా అనడిగాడు. అలా వైద్యుడు అప్పిస్తాడనే నానుడి ఉండిపోయింది...కానీ....

ఇప్పుడే డాక్టరూ అప్పుకాదుకదా పలకరింపుగా ఓ నిముషంకూడా మీ కోసం నా కోసం ఉదారంగా ఇవ్వనేఇవ్వడు. అప్పు అడిగేంత అందుబాటులోనే ఉండడు. రిసెప్షన్ అనబడు ముందస్తు నమోదుస్థానమందే డబ్బు కన్సల్టింగ్ ఫీజుగా కబళించబడును. ఆ తదుపరే నవ్వులు చిందించే వైద్యశిఖామణి నీ నాడి ఉన్న చేతిని పట్టుకొనును.

ఇప్పుడు అప్పిచ్చే మహానుభావులు... అసలు కంటే వడ్డీయే ముద్దు అనుకునే బాపతు. వీరు గ్రామస్థాయినుండి ప్రపంచస్థాయిదాకా ఉన్నారు.

విలేజీ స్థాయి అప్పిచ్చువాడు 'డాక్టరు' అయితే...వరల్డ్ స్థాయి అప్పిచ్చువాడు 'డ్రాక్యులా' అన్నంత తేడా ఉందనుకోండి. 'డాక్టర్ల'తో మనకొచ్చిన ప్రమాదమేమీ లేదుకానీ 'డ్రాక్యులా'(నెత్తురు పీల్చే పిశాచి)తోనే ఈ లోకానికి కీడు.

ఇంగ్లీషు సినిమాల్లోలా ఈ 'డ్రాక్యులా' భయంకర రూపంతో కనబడదు. ఐయంఎఫ్, వరల్డ్‌బ్యాంకు ఇలాంటి నాజూకు పేర్లమాటున ఉంది ఈ డ్రాక్యులానే అని నేను వేరేగా చెప్పక్కర్లేదనుకుంటా!

దేశాలకు దేశాల్నే దిగమింగాలని చూసే అప్పులోడు ఇంటర్నేషనల్ సారు. తాళిబొట్లకూ, ఇంటికాగితాలకూ, పొలం దస్తావేజులకు ఆశపడే అప్పులోడు లోకల్ దొర.

ఇంతకీ ఈ అప్పిచ్చువాడు వైద్యుడు అన్న మన సామెత మాటవరుసకు కూడా మిగిలేలా లేదుమరి! ✤

ఈ సంచికలో . . .

ఓరా!	...	3
కార్టూన్ కదంబం...	...	4
కవర్ స్టోరీ	...	5
జీవనశైలి	...	10
బాలల కథ	...	11
బాలనేస్తాలు	...	12
ఇంతిసంగతులు	...	16
నువ్వద్ది	...	17
ఆరోగ్యం	...	18
పుస్తక పరిచయం	...	20
న్యాయసలహాలు	...	24

ఇంకా...

బలిపీఠం
కథ ... 8, 9

త్రినేత్రి
రియల్‌స్టోరీ ... 14, 15

దసరా ఉత్సవాల మైసూర్ ప్యాలెస్
టూరిస్ట్‌గైడ్ . . . 21

అతని నోరు వాయిద్యాల గని...!
కళాసాహితి . . . 22, 23

ఓరా!



క్రెడిట్ కార్డంత గన్

ఇది చూడ్డానికైతే క్రెడిట్ కార్డులా ఉంటుంది. దీనికున్న ట్రిగ్గరులాంటిది నొక్కామో...టిష్యూం రిష్యూం. 'కోసీల్స్కి గన్స్ అండ్ యమ్మో' అనే కంపెనీ వారు ఈ రహస్య ఆత్మరక్షణాయుధం తయారుచేశామంటూ ప్రెస్‌మీట్ పెట్టి బహిరంగప్రకటన చేశారు. ఆత్మరక్షణార్థం క్లోజ్‌డ్ రేంజ్‌లో అంటే దగ్గరగా ఉండే శత్రువుపై పేల్చడానికి మాత్రమే అనువైందట. ఈ క్రెడిట్‌కార్డు సైజ్ షాట్‌గన్ తయారీదారు మార్క్ కోసీల్స్కి, "చౌక..చౌక... కేవలం వంద డాలర్లకే రిటైల్ అమ్మకం" అంటున్నారు. ఒక్కసారి లోడ్ చేసిన బారెల్‌లో ఏడు స్టీల్ బులెట్స్ ఉంటాయిట. దీనికి భయపడాల్సిన దుండగుడో, దుండగత్తో, "ఆ...క్రెడిట్ కార్డు ప్లాస్టిక్కు ముక్కే కదా" అనుకుంటే మాత్రం తప్పనిసరిగా పేల్చి చూపాల్సిందే ! ఆత్మరక్షణార్థం ఎంత ఉపయోగపడినా అమెరికాలో బడిపిల్లల చేతికి మాత్రం అందకుండా చూసుకుతీరాల్సిందే. అసలే... బలపంముక్క లాక్కున్నాడని తమ ఇంట్లోని రివాల్వర్ దొంగచాటుగా తెచ్చుకుని తోటివిద్యార్థులపై కాల్పులు చేస్తున్న గత్తరకాయలున్నారు మరి!

బురఖా తనువులకే గానీ...

ఢిల్లీ-టెహ్‌రాన్, టెహ్‌రాన్-ఢిల్లీ విమాన సర్వీస్ ఇటీవల మహారద్దీగా తిరుగుతోంది. ఎందుకంటే ఈ సర్వీసు విమానఛార్జీ 'కారు'చౌకట! చక్కచక్కటి చున్నీలు, మఫ్లర్లు ఢిల్లీ హోల్‌సేల్‌మార్కెట్లలో కొనేసి ఈ సర్వీసువిమానమెక్కి తిరిగెళ్ళి అక్కడ అమ్ముకునే మహిళలు ఎక్కువగా వచ్చిపోతున్నారు. ఢిల్లీకొచ్చేటప్పుడు టైట్‌జీన్స్, బ్రౌన్ కలర్డ్ హెయిర్, లిప్‌స్టిక్ అందాలతో వచ్చి తిరిగెళ్ళేటప్పుడు టెహరాన్ ఇంకొద్దిసేపట్లో దిగుతామని ఎనౌన్స్ రాగానే గబగబా తమ బ్యాగుల్లో దాచుకున్న బురఖాలు దిగేసుకుంటారు. కాళ్ళుకూడా కనబడకుండా మందపాటి సాక్సు వేసేస్తారు. ఇప్పుడా ఇరాన్‌లో కాస్మొటిక్ సర్జరీకి బహుడిమాండుందిట. అందుకే తమ ముక్కు అందాలు తీర్చిదిద్దించుకునేందుకు ముక్కులు కోయించుకుంటున్నారు. కొన్నాళ్ళపాటు బాండేజీలంటిస్తున్నారు. ఆ బాండేజీ స్టిక్కరు మాటున వయ్యారాలు పోబోయే ముక్కునూహించుకుని ఉబలాటపడిపోతున్నారు. అయితుల్లాఖొమైనీగారి ఇరాన్ ఆడవాళ్ళ తనువులకు బురఖాలేసినా తలపులకు వేయలేదు కదా!



"అనుకున్నామని జరగవు అన్నీ...

అనుకోలేదనీ ఆగవు కొన్ని...జరిగేదంతా మంచికనీ...అనుకోవడమే మనిషి పని" అని ఘంటసాలగారు తెలుగులో పాడారు కదా. అందుకని పాపం ఉమాభారతికిగానీ, సుష్మాస్వరాజ్‌కిగానీ తెలియదు. తిరంగా యాత్రను బయలుదేరదీసి ఏదేదో సాధించవచ్చనుకుంది ఉమాయమ్మ. వీర సావర్కారు చుక్కానిపట్టి అధికారసాగరాన్ని ఈదొచ్చనుకుంది సుషమాయమ్మ. ప్రమోద్ మహాజన్ ఒకవైపు భోజ్‌పురీ హిందీలో, వెంకయ్యనాయుడుజీ మరోవైపు తెల్-హిందీలో ఏమేమేమేమో ఊహించుకుంటూ తెగ వాయించేశారు. ఈ గ్యాంగ్ ఆఫ్ ఫోర్ ఇప్పుడు "గ్యాంగ్ ఆఫ్ ఫోస్(శతృవులు)" అయిపోయారు. వృద్ధాప్యంతో...నూరేళ్ళు నిండబోతున్న నాయకమ్మన్యులనధిగమించి ప్రధాని సింహాసనప్పరుగు పందెంలో ఈ "...చతుష్టయం" ఒకరికొకరు పోటీపడుతున్నారు కదా! తమతమ యాత్రల జాతర్లకు నూరేసేళ్ళ వయస్సుకి దగ్గర్లో పడిన నాయకోత్తముల ఊతకర్రలు తమకు సాయం చేస్తాయని ఎన్నెన్నో కలలు కనుకుంటూ సాగుతున్నారు. ఒకరిని మించిన ఒకరీ ఆచంట మల్లన్నలు, మల్లమ్మలు. తిరంగా యాత్రికురాలికేమో ఉన్నదీ(ముఖ్యమంత్రిత్వం) పాయె...రాబోయేదీ(ప్రాచుర్యం) దూరమైపాయే ! సావర్కారు విగ్రహావిష్కురాలికేమో అలివికాకుండే !! మహాజన నాయుడులకేమో ఎదురుదెబ్బలు మెండాయె !!! ఏం చెయ్యాలో ఎవ్వరికేమీ తోచదాయె !!!!

కార్టూన్ కదంబం


ఒంగోలుకు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్తున్నాడటలే...
నీళ్ళు అడిగిన ఒంగోలు రైతుల కాళ్ళకు సంకెళ్ళు


అన్నలు పంపారు సార్ తెలంగాణ పోరాటానికి వాళ్ళూ వస్తారట మీకు ఇవ్వమని...?
ప్రత్యేక తెలంగాణ కోసం
— వార్త
నారు


సంస్కరణలు
చంద్రబాబు బాటలో వైఎస్ సంస్కరణలు ఆస్తి, నీటి పన్నులు పెంచాలని యోచన

దసరా మా ఊళ్ళో సరదా

మనం జరుపుకునే పండుగలలో దసరా కూడా ఓ మాంఛి సరదా అయిన పండుగ. ఏ సమాజంలో అయినాసరే అందరూ సామూహికంగా ఆనందం వ్యక్తం చేసుకునే రోజునే పండుగ, పర్వదినం అంటున్నాం. అన్ని దేశాలలో లాగే మన దేశ కాలెండర్ కూడా ఉగాదినుంచి మొదలై సంక్రాంతితో పెద్దపండుగల రౌండు పూర్తవుతుంది. రుతువులు, జీవనోపాధికి సంబంధించిన పనులు, వాటి విరామకాలాలు, ఆ విరామాలలో ఇలాంటి పండుగ ఆనంద సమయాలను చక్కగా కంపోజ్ చేసినదే ఈ కాలెండర్. ఈ వరుసలో వెంటవెంటనే ఒకదానివెంట ఒకటి వచ్చే పండుగల్లో సరదా పండుగ ఈ దసరా. ఆ సరదా ఈ వారంలోనే...

భారతదేశ ప్రాచీనసాహిత్యం మన పండుగలన్నింటికీ ఏదో ఒక అద్భుతమైన కథను అల్లింది. ఆయా కథలకనుగుణంగా ఏదో ఒక క్రతువును, సాంస్కృతిక కార్యక్రమాన్ని రూపొందించారు. ఇవన్నీ ఆనాటి దేవాలయాలు, గుళ్ళు, గోపురాలు కేంద్రంగా సాగడంతో వాటిపై కొంతమందికి గుత్తాధిపత్యం వచ్చింది. దానితో వాటి రూపంలో మార్పు వచ్చింది కానీ... చెడు పోయి మంచి గెలవాలి, మంచి నిలవాలి అనేదే వాటి సారం!

దుష్టత్వానికి ప్రతీక అయిన మహిషం(ఎద్దు) రూపంలో ఉన్న అసురుణ్ణి(రాక్షసుడు) పార్వతీదేవి దుర్గాదేవి అవతారంఎత్తి అంతం చేసింది. ఆ మహిషాసురమర్ధిని తొమ్మిది(నవ) రాత్రులు యుద్ధంచేసి, పదవరాత్రి విజయం సాధించింది. ఆ రోజు విజయదశమిగా ఈ పదిరాత్రులను కలిపి దస్-రాహ్....దసరాగా ఏర్పడిందని చెబుతారు. మహిమాన్వితంగా వర్ణించుకున్న ఈ కథద్వారా చెడును చెండాడిన వీరోచిత గాథగా ఈ నవరాత్రి ఉత్సవాలు చేస్తారు. అందుకే ఈ పండుగను ఆయుధపూజగా కూడా పాటిస్తారు. ఈ పూజ నేడు గమ్మత్తయిన రెండు రూపాలు తీసుకుంది. శ్రామికులు తమ శ్రమ పరికరాలను పూజించడంగా ఒక వైపు మార్పుతీసుకుంది. మరోవైపు ప్రజలను చితకబాదే, కాల్పులుచేసే లాఠీలకు, తుపాకులకు పోలీస్‌స్టేషన్లలో ఆయుధపూజ చేయడంగా కూడా మార్పు తీసుకుంది. జేబుదొంగలు తమ బ్లేడులకు, హంతకులు బాకులకు, ఫ్యాక్షనిస్టులు బాంబులకు ఆయుధపూజగా మారితే ఏమని విశ్లేషించాలో....!

ఈ పండుగ గురించి ఎవరైనా సరే, "దసరా మా ఊళ్ళో అయితేనా..." అంటూ ఓ తన్మయత్వంతో చెబుతారు. దసరా మన ఆంధ్రప్రదేశ్‌లోనే రకరకాలుగా చేస్తారు. మచిలీపట్టణం, విజయవాడ, కరీంనగర్, గద్వాలలో దసరా విలక్షణంగా జరుగుతుంది.

కరీంనగారా... దసరా అకాడా...

కరీంనగర్ జిల్లా గోదావరిఖని బొగ్గుట్టల నల్లబంగారపు గని. ఆ బొగ్గు బాయిలలో పనికి వచ్చిన కార్మికుల కుటుంబాలన్నీ తెలంగాణా మాగాణుల నుంచి వచ్చినవారే. తమతోపాటు గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలను తీసుకొచ్చినవారే. అందుకే గోదావరిఖనిలో దసరా పండుగ గ్రామీణ జానపదీయత ఉట్టిపడేలా జరుపుతారు. అటు పారిశ్రామిక ఉకుమ్మడి బతుకు సంస్కృతి, తమతో తెచ్చుకున్న గ్రామీణ సంస్కృతి కలగలిసిన పండుగగా దాదాపు నాలుగు లక్షల కోల్‌బెల్ట్ ఏరియా ప్రజలు జరుపుతారు. తెలంగాణా అంతటా బతుకమ్మలు ఎంత ప్రాచుర్యమో, ఇక్కడ "అకాడాలు" కూడా అంత ప్రసిద్ధికెక్కాయి. క్షత్రియుల ఆయుధవిన్యాసాల మాదిరిగా ఉండే ప్రదర్శనపూర్వకమైన సంబరం అకాడాలు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పెద్దసైజులో తయారుచేసిన నరకాసురుడి బొమ్మను సంహరించడంతో అకాడా మొదలౌతుంది. అక్కడి యువకులు హనుమాన్ అకాడా, మహంకాళీ అకాడా అని రకరకాల పేర్లతో పది అకాడాలను తయారుచేసుకుని పెద్దపెద్ద కత్తులు, ఇనుపబెల్టులు, శూలాలతో యుద్ధవిన్యాసాలు, కర్రసాములు తదితర సాహసకృత్యాలతో దసరా సాయంకాలం గోదావరిఖని అంతా ప్రదర్శనలిస్తారు. దీనిలో దాదాపు అందరూ పాల్గొంటారు. ఆ తరువాత జమ్మి ఆకులు పంచుకుని ఒకరికొకరు ఆలింగనంచేసుకుని(అలాయిబలాయి) శుభాకాంక్షలు చెప్పుకుంటారు.

గద్వాల సంస్థానంలో ఆయుధపూజ



నిజాం నవాబు హైదరాబాద్ కేంద్రంగా పరిపాలన చేస్తున్న కాలంలో మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల, అమరచింత, వనపర్తి, కొల్లాపూర్ , గోపాల్‌పేట సంస్థానాలుండేవి. గద్వాల, అమరచింత సంస్థానాల్లో పాకనాటిరెడ్లు, వనపర్తి, గోపాల్‌పేట సంస్థానాల్లో మోటాడిరెడ్లు, కొల్లాపూర్ సంస్థానంలో వెలమదొరలు రాజ్యపాలన చేసేవారు. అన్నింటికంటే గద్వాల సంస్థానంలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేవారు. గద్వాల సంస్థానాధీశులు సర్వస్వతంత్రులు. ధైర్య సాహసాలతో యుద్ధం చేసి శత్రువులను ఓడించి భూభాగాన్ని సంపాదించి సంస్థాన విస్తరణ చేశారు. గద్వాల కోటగోడలను ప్రత్యేక పరిస్థితులలో నిర్మించారు. రాజా సోమభూపాల రాయణింగారు 18శతాబ్దిలో గద్వాల కోటను కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్మించుకున్నారు. ఆనాడు ఉన్న ఆయుధాలకు ఉన్న ప్రాముఖ్యత వల్లనే రాజులు విజయకేతనం ఎగురవేసేవారని పూర్వీకులు చెబుతారు. గద్వాల రాజులకు పలు విధాలైన ఆయుధాలుండేవి. ఫిరంగులు, తోపులు, కత్తులు, కటార్లు, రైఫిల్, రివాల్వర్, వెయిట్ ఎ మినిట్‌గన్ మొదలగు మందుగుండు సామాగ్రి కాకుండా అనేక ఆయుధాలు ఉండేవి. ఈ ఆయుధాలను రాజా రాంభూపాల్ కాలం (1850)వరకు ఉపయోగించే వారు. వివిధ యుద్ధాల్లో వినియోగించిన ఆయుధాలకు ప్రతి సంవత్సరం దసరా పర్వదినం సందర్భంగా తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించి పెద్దలను స్మరించుకోవడం, వారి ధైర్యసాహసాలను పొగుడుకోవడం పరిపాటిగా ఉండేది. సుమారు మూడువేల ఆయుధాలను రాజులు ఆ కాలంలో యుద్ధసమయంలో వినియోగించేవారు. ఈ ఆయుధాలన్నింటిని ఒక పెద్దహాలులో భద్రపరిచి ఉంచారు. దసరాకు రెండు నెలల ముందే వాటిని బయటకు తీసి, కోటలోని దర్బార్‌హాలులో వాటిని శుభ్రం చేసేవారు. ఏడంకనాల సోఫా హాలు (దర్బార్ హాలు)లో ఈ ఆయుధాలను దసరా సందర్భంగా ప్రదర్శించేవారు. ఆనాడు రాజులు ధరించే ఇనుప సేర్వానీలు, తలకు ధరించే టోపీలు , చేతులకు తొడిగే కవచాలు ప్రజలను చాలా ఆకర్షించేవి. తొమ్మిదిరోజులు క్రమంగా పూజలు చేస్తూ చివరిరోజు విజయదశమినాడు వారి సైన్యాన్ని దర్బారు హాలు ఎదుట సమావేశపరిచేవారు. విజయదశమినాడు సంస్థానాధీశులు, వారి బంధువులు, ఉద్యోగులు , అందరూ ఊరేగింపుగా కోటనుండి గుండుకేశవస్వామి ఆలయం దగ్గరలో ఉన్న జమ్మిచెట్టు వద్దకు పోయి జమ్మిఆకును తెంచి దసరా బంగారు అని పరస్పరం పంచుకునేవారు. ఆ కాలంలో జమ్మి ఆకును ఒకరికొకరు పంచుకుని ఆలింగనం చేసుకుని పెద్దలకు పిన్నలు పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందేవారు. ఈనాడు రాజ్యం పోయింది. రాజులు పోయారు. రాజరిక వ్యవస్థ రూపుమాసింది. ఈ స్థానంలో ప్రస్తుతం ఆయుధాలు లేవు. కోట విద్యాకేంద్రంగా మారింది. సంస్థానాధీశులకు ఆరాధ్య దైవమైన కులదేవత శ్రీచెన్నకేశవస్వామి దిక్కులేని వాడయినాడు. పట్టించుకునే నాథుడులేడు. చెన్నకేశవస్వామి గుడిలో దసరా పండగ జరుపుకునే తొమ్మిది రోజుల్లో చెక్కెర పొంగలి, పులిహోర, ఒడలు, ఒట్టిపొంగలి, తదితర అల్పాహారాలు రాణి, రాజు పిల్లలు ప్రజలకు పంచేవారు. రాజదర్బారుకు ఆయుధ పూజ నిర్వహించే ప్రదేశానికి వ్యవసాయ కార్మికులు కొడవళ్లు, గొడ్డలి, నాగలి తదితర పనిముట్లను తెచ్చి పూజలు నిర్వహించేవారు. మాంసాహారం ఆ రోజుల్లో ఎక్కువగా వండేవారు కాదు. ఇప్పుడు మాంసాహారం తింటున్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఇక్కడ లేదని దసరా పండగను గతంలో చేసినంత వైభవంగా చేయడం లేదని స్వాతంత్ర్య సమరయోధుడు పాగాపుల్లారెడ్డి తెలిపారు.

- అక్బర్‌బాష, గద్వాల

కలకత్తా తరువాత బందరులోనే శక్తిపటాల పూజలు



కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం (బందరు)లో విజయ దశమి వేడుకలను ప్రాచీన నాగరికత ఉట్టి పడేవిధంగా జరుపుకుంటారు. మనదేశంలో కలకత్తా కాళికాదేవి ఆలయం తర్వాత మచిలీపట్నంలోని శక్తి గుడి ఆలయంలో మాత్రమే దసరా పండుగ సందర్భంగా శక్తి పటాలు పూజలందుకుంటాయి. దాదాపు వంద సంవత్సరాల నుండి ఈ సంప్రదాయం ఇక్కడ కొనసాగుతోంది. తొమ్మిది రోజులపాటు నవరాత్రి వేడుకలు నిర్వహించి తొమ్మిదో రోజు శక్తి పటాన్ని మచిలీపట్నం కోనేరు సెంటర్‌కు ఊరేగింపుగా తీసుకెళతారు. అక్కడ జమ్మి కొట్టడం (పూజ చేయడం)తో నవ రాత్రులు ముగుస్తాయి. అంతకుముందు దసరా జరిగే తొమ్మిది రోజులూ శక్తి పటాన్ని (ప్రభల రూపంలో) ప్రతి వీధిలోనూ ఊరేగిస్తూ ఇంటింటికీ తీసుకెళతారు. దాదాపు ఇరవై అడుగుల ఎత్తుండే శక్తిపటాన్ని నిష్ట వహించిన వ్యక్తి వీపు వెనుకగా నడుముకు కట్టుకుంటాడు. ముఖానికి శక్తి అమ్మవారి భయంకర ముఖాకృతిని తగిలించుకుంటారు. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా వీరనాట్యం చేస్తూ, ఎదురుగా అఘోరీ వేషంలో ఉన్న రాక్షసుణ్ణి సంహరిస్తున్నట్లుగా అభినయిస్తారు. ఈ ఊరేగింపు తమ ఇళ్ల మధ్యగుండా వెళుతున్నప్పుడు స్థానికులు తమ మొక్కులు తీర్చుకుంటారు. తమ ఇంటికో, షాపుకో వచ్చిన ఆ శక్తిపటానికి తమ శక్తికొలదీ దసరా మామూలు ఇస్తారు. కోరిన కోర్కెలన్నింటినీ శక్తి నెరవేరుస్తుందనే నమ్మకం ఇక్కడివారిలో బలంగా నాటుకుపోయింది. ప్రతి దసరా వేడుకలకు దేశంలోని అనేక ప్రాంతాల నుండి యాత్రికులు వస్తారు. ప్రవాస భారతీయులు సైతం పెద్ద సంఖ్యలో ప్రతి ఏడాది శక్తి గుడిని సందర్శిస్తారు. అదేవిధంగా పట్టణ శివారు బందరుకోటలో నవ రాత్రులు నిర్వహించి అక్కడి దేవుళ్లు ఏకాంబరేశ్వరుడు, లక్ష్మీ నరసింహలను గ్రామస్తులు తొమ్మిదోరోజున కోనేరు సెంటర్‌కు ఊరేగింపుగా తీసుకురావడం ఆనవాయితీ. బందరుకోట దేవుడు ఇంకా రాలేదేవిటా అని ఎదురుచూసేవారు. బందరుకోట నుండి కోనేరు సెంటర్ వరకూ సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం మేర ఈ దేవుళ్లను ఊరేగించి అక్కడ జమ్మి కొడతారు. ఊరేగింపు సందర్భంగా దారి పొడవునా నిర్వహించే సాధనాలు, అగ్గి బరాటీలు, డుప్పి కొమ్ములు, బాకులతో ఆటలు, కర్రసాము, పులి వేషాలు, బండ్లపై రకరకాల దేవుళ్ళ వేషాలు ఇక్కడి విజయదశమి వేడుకల వైభవానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. బందరు పట్టణంలోని అన్ని శక్తిపటాలు ఆ రోజున అక్కడ పోటీ పడతాయి. రెట్టించిన ఉత్సాహంతో, వేగంగా, మహోగ్రంగా ఆడతాయి.

-ఫణి, మచిలీపట్టణం



బెజవాడ దసరా ఉత్సవాలు

'భేతాళ నృత్య విన్యాసాలు'

రాష్ట్రంలోనే ప్రధాన ఆలయాల్లో కనకదుర్గగుడి ఒకటి. దసరా ఉత్సవాల్లో విజయవాడలో జరిగే ప్రభ మహోత్సవాలు, ఆ సందర్భాల్లో చేసే వివిధ నృత్య విన్యాసాలు చాలా ప్రత్యేకమైనవి. ప్రతి దసరా నవరాత్రులకూ కూడా ఇక్కడ వివిధ కూడళ్లల్లో ఉత్సవాలను ఏర్పాటుచేసి ఆ తొమ్మిది రోజుల్లో ఒక రోజు ప్రభలను ఊరేగించడం ఇక్కడ ఆనవాయితీ. ఈ ఉత్సవంలో ప్రజలను అలరించేవి భేతాళ నృత్యాలు. డప్పు వాయిద్యాలతో లయబద్ధంగా సాగే ఈ నృత్యాలతో ప్రజలు తెలియని అనుభూతి పొందుతారు. ఈ భేతాళ వేషాలకు విజయవాడ పుట్టినిల్లు. వన్‌టౌన్ ప్రాంతంలో మొదలైన ఈ భేతాళ నృత్యాలు కాళికాదేవి ప్రతి రూపాలతో ప్రస్తుతం రాష్ట్రమంతా సాగుతున్నాయి.

1950వ దశకంలో వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని రామాలయం వద్ద రెండు శక్తి రూపాలను చూసి కొందరు యువకులు సరదాగా నలుపురంగు పూసుకొని వేషాలను వేశారు. ఇది చూసిన వారి మిత్రులు ఇద్దరు తమ డప్పులపై కొన్ని శబ్దాలను అందించగా, లయబద్ధంగా అడుగులు కలుపుతూ నృత్యాలను తయారు చేశారు. కాలక్రమంలో ఉత్సాహవంతులైన యువకులు ముందుకు వచ్చి ఈ కళను ప్రదర్శిస్తూ భేతాళ నృత్యాలకు మరింత ప్రాచుర్యాన్ని కల్పించారు. వీరిలో కొంతమంది కిరీటాకృతిలో సైకిలు చువ్వలను ఏర్పాటు చేసి వాటికి చివర నిమ్మకాయలు తగిలించి ప్రజలను ఆకర్షించడం ప్రారంభించారు. ప్రస్తుతం విజయవాడలో 250 నుండి 300 మంది కళాకారులు భేతాళ నృత్యాలతో రాష్ట్రంలో వివిధప్రాంతాల్లో ప్రదర్శనలిస్తున్నారు. ముఖ్యంగా పాలఫ్యాక్టరీ కార్మికులు, కాళేశ్వరరావు మార్కెట్‌లోని చిరువ్యాపారులు, పాతబస్తీలోని మాజీ శాసనసభ్యులు సర్దార్ మరుపిళ్ల చిట్టి జ్ఞాపకార్థం ఆయన శిష్య బృందం, గాంధీనగర్‌లోని రాధారంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ ప్రభ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వీటితోపాటుగా నగరంలోని ప్రధాన ఆలయాలన్నింటిలోనూ దసరా ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి పేటలోనూ ముత్యాలమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ పేర్లతో గ్రామదేవతలను కొలవడం అక్కడ ప్రజలకు పరిపాటి. నగరం ఏర్పడిన తొలినాళ్ల నుంచి వివిధ ప్రాంతాల్లో వారి వృత్తులను బట్టి ఆయా వర్గాల ప్రజలు స్థిర నివాసాలను ఏర్పరచుకున్నారు. అటువంటి వాటిలో ఒకటి పాతబస్తీ వించిపేటలోని రెల్లికాలనీ. నగరం మున్సిపాలిటీగా ఏర్పడిన నాటి నుండి వందలాది మంది రెల్లి కులస్తులు ఈ ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. ఇక్కడి 'వడ్డపాలమాంబ' అనే దేవతను కులదేవతగా కొలుస్తారు. ఆమెకు ఇక్కడే ఆలయాన్ని కూడా నిర్మాణం చేశారు. 108 సంవత్సరాల చరిత్ర కలిగిన ఇక్కడి ఆలయంలో దసరా సందర్భంగా రెల్లి కులస్తులు తమ సంప్రదాయాలతో ఉత్సవాలను నిర్వహించుకుంటారు. వీరితో పాటుగా 80 సంవత్సరాల క్రితం ఒరిస్సా నుండి వచ్చి టైలర్‌పేటలో స్థిరపడిన రెల్లి కులస్తులు కూడా 'వడియాదుర్గాంబ'ను కులదేవతగా కొలుస్తారు. ఆమెకు 60 సంవత్సరాల క్రితం గుడిని నిర్మించారు. దీనికి సంబంధించి పలు గాథలను ఇక్కడి ప్రజలు చెబుతూ ఉంటారు. అదేవిధంగా శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కృష్ణానదీ అలలపై విజయదశమి రోజు జరిగే తెప్పోత్సవానికి వేలాదిమంది ప్రజలు హాజరై తిలకిస్తారు. నదిలో మూడుసార్లు తిరిగే ఈ తెప్పోత్సవం దసరా ఉత్సవాల్లో హైలైట్‌గా నిలుస్తుంది. ఈ ఉత్సవాలన్నింటిలో కూడా భేతాళనృత్యాలు మనకు దర్శనమిస్తాయి.

- విస్సా శేషగిరిరావు

తెలంగాణా పల్లెకు ఉత్సాహాన్నిచ్చే 'బతుకమ్మ'

ఒక్కొక్క పూవేసి చందమామ
ఒక్క జాము ఆయె చందమామ
శివుడింక రాడాయె చందమామ శివుని
పూజాలాయె చందమామ
రెండేసి పూలేసి చందమామ
రెండు జాములాయె చందమామ
శివుడింక రాలేదు చందమామ

అని పాటలు పాడుతూ ఒక్కొక్క పువ్వును బతుకమ్మపై వేస్తూ, పదిసార్లు శివుణ్ణి ప్రార్థిస్తారు. బొడ్డెమ్మ పండుగ అనంతరం వచ్చేది బతుకమ్మ పండుగ. ముఖ్యంగా తెలంగాణా జిల్లాల్లో బతుకమ్మ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ప్రకృతిలో లభించే రకరకాల పూలతో ఆరాధించే పండుగల్లో దీనిని ప్రత్యేకంగా చెప్పవచ్చు. ప్రకృతిని పూజించడంలో భాగంగానే బతుకమ్మను పూజిస్తూ వస్తున్నారని చారిత్రకుల అభిప్రాయం. బతుకమ్మ పండుగను జరుపుకునేది ప్రధానంగా స్త్రీలే. ఏడాదిలో వచ్చే అన్ని పండుగల్లోకెల్లా బతుకమ్మ ముఖ్యమైనది. ఈ పండుగను తొమ్మిదిరోజుల పాటు చేస్తారు. బతుకమ్మ పండుగ వచ్చిందంటే గ్రామాల్లో, అన్ని కుటుంబాల్లో సందడి నెలకొంటుంది. బతుకమ్మను పేర్చడం కోసం 'తంగేడు' పువ్వును సేకరిస్తారు. దీనికితోడు గునుగు, బంతి, తామర పువ్వులను సేకరించాక భక్తిశ్రద్ధలతో వెదురుతో తయారుచేసిన 'సిబ్బి'లో పేర్చుతారు. గుండ్రంగా పేర్చుతూ పైకి వచ్చే కొద్దీ వెడల్పు తగ్గిస్తూ తయారుచేయడంతో బతుకమ్మ ఎంతో శోభాయమానంగా తయారవుతుంది.



పేర్చిన బతుకమ్మను పూజించాక సాయంత్రం ఆడపడుచులు మూస్తాబై వీధులగుండా తీసుకెళతారు. చెరువు గట్టున బతుకమ్మలను ఉంచి మహిళలంతా చుట్టూ తిరుగుతూ రామాయణం, మహాభారతం కథల ఆధారంగా పాటలు పాడుతారు. అందులో .. సీతపై ఆలపించే పాటలో ఇదొకటి ..

జనకు జనకూనింట్ల ఉయ్యాలో .. ఆ
జనకూనింట్ల ఉయ్యాలో ..
పుట్టెను ఆ సీత ఉయ్యాలో ..
పుణ్యజనకూనింట్ల ఉయ్యాలో ..
అంతా ఇంత సీత ఉయ్యాలో ..
పెద్దదయినాది ఉయ్యాలో .

బతుకమ్మ పండుగలో భాగంగా వచ్చే మొదటిరోజును 'ఎంగిలిపూవు' అని అంటారు. బొడ్డెమ్మ పండుగ ముగిసిన సమయంలో పూలను తెంపి నీళ్లలో వేస్తారు. పూయని మొగ్గలను నోటితో ఊదడం వల్ల అవి వికసిస్తాయి. అందుకే మొదటి రోజు బతుకమ్మ పండుగను ఎంగిలిపూలని అంటారు. తొమ్మిదోరోజు వరకు బతుకమ్మను శ్రద్ధగా పూజిస్తారు. చివరి రోజును 'సద్దుల బతుకమ్మ' అని అంటారు. మొదటి నుండి ఎనిమిదోరోజు వరకు చేసిన బతుకమ్మ కంటే తొమ్మిదవ రోజు ఆడే బతుకమ్మకు ప్రత్యేకత ఉంది. ఆ రోజు ఆడపడుచులంతా కొత్త బట్టలను, బంగారు ఆభరణాలను ధరించి అందంగా అలంకరణ చేసుకుంటారు. బతుకమ్మలను చెరువు గట్టుకు తీసుకురాక ముందే ఇంటివద్ద ఆడుకుంటారు. ఊరేగింపు ముందు భాగంలో బ్యాండు మేళాలతో ఊరి ప్రజలంతా ఉత్సాహంగా వస్తారు. అనంతరం చెరువు వద్ద ఉంచి మహిళలంతా పాటలు పాడుతారు. చీకటి పడుతున్న సమయంలో చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా ఆడపడుచులంతా ఎంతో బాధతో బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేస్తూ పాడే పాట ..

తంగేడు పూవుల్ల చందమామ ..
మల్లెన్నడొస్తావు చందమామ ..
పోతెపోతివిగాని చందమామ ..
మల్లెన్నడొస్తావు చందమామ ..
ఏడాదికొకసారి చందమామ ..
ఆడుకుంటు వస్తా చందమామ ..

అంటూ ఎంతో ఆవేదనతో బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేస్తారు. అనంతరం పెసర పప్పు, బెల్లంతో కలిపి తయారుచేసిన ప్రసాదాన్ని పంచుతారు. ఇలా తొమ్మిది రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా జరిగే పండుగ బతుకమ్మ.

- సిహెచ్ సోమనర్సయ్య, కరీంనగర్

కథ



బలిపీఠం

వెంకట సుబ్బారావు కావూరి

'భౌ భౌ'

గుడిసె పక్కనే పడకేసిన కుక్క మొరిగింది.

గుడిసెలో కలతనిద్ర పోతోన్న వరమ్మకు మెలకువ వచ్చింది. "అమ్మో తెల్లారబోతున్నట్లుందే" గొణుక్కుంటూ తడికె నెట్టుకుని బయటకు వచ్చి ఆకాశం కేసి తేరిబార జూసింది.

మిలమిలా మెరుస్తూ వేగుచుక్క కన్పించింది. కలవరపడింది వరమ్మ. రోజూ అర్ధరాత్రే లేచేది. ఎన్నో నిద్రలేని రాత్రుల మధ్య చాన్నాళ్ళకు కళ్ళు కూరుకుపోయాయి.

"చావన్నా రాదుగదా" తనను తనే తిట్టుకుంది. గుడిసెలోకి పోయి పొయ్యి గెలికి కాసింత బూడిద తీసుకుని నోట్లో పోసుకుంది. బయటకొచ్చి కుండకాడ చేరింది. నోట్లోకి వేలు పోనిచ్చి కసకసా పళ్ళు తోముతుండగా కొండయ్య బయటకు వచ్చాడు.

"ఏందే నన్ను లేపలేదు" ఆవలిస్తూ అడిగాడు వరమ్మని. "నాకే మెలుకువ రాలేదు. ఇంక నిన్నేడ లేపేది." విసుక్కుంటూ చెప్పింది వరమ్మ.

"సరె సరే తొందరగా తెములు. పల్లేమీ పుచ్చిపోవుగనీ, తెల్లారక ముందే పోకపోతే ఒక్క ముక్క దొరకదు." భార్య వరమ్మను హెచ్చరించాడు కొండయ్య.

"సర్లే చెప్పొచ్చావు. నువ్వుగాదూ ఇంత చేసింది. పైగా సుద్దులు చెప్పచ్చావు, సుద్దులు." వరమ్మ గతాన్ని తవ్వి కొండయ్యను ఎత్తి పొడిచింది.

మళ్ళీ నోరెత్తలేదు కొండయ్య. తనూ బూడిద తెచ్చుకుని పళ్ళు తోమే పనిలో మునిగిపోయాడు.

వరమ్మ గోతం తీసుకుని బయటకు వచ్చి "నే బోతండా, సద్దికూడుంది. తిని తెల్లారిన తర్వాత పో. అసలే ఎతిమతపోడివి. కాస్త బస్సులయ్యా చూసుకుని పోతుండు." పోతూ పోతూనే మొగుడికి జాగ్రత్తలు చెబుతూ చీకట్లో కలిసిపోయింది.

హెల్ప్ ఆసుపత్రి రోడ్డుకు చేరుకుంది వరమ్మ. రోజూ వచ్చే సమయం దాటిపోయినా ఇంకా తెల్లవారలేదు. కొంతలో కొంత నయమేననుకుంది. తెల్లవారితే తన లాంటి వాళ్ళు బోలెడు మంది వచ్చి పడిపోతారు. అందులోనూ పిల్లలే ఎక్కువ. వాళ్ళతో పోటీపడి తాను సాధించేదేమీ ఉండదని వరమ్మకు ఒకటి రెండుసార్లు అనుభవమయింది. పైగా తన ఊరివాళ్ళు కొంతమందీ, కనిగిరి ప్రాంతపోళ్ళయితే వేలాదిమంది ఇక్కడే ఉంటున్నారు. వాళ్ళలో ఎవరన్నా చూస్తారేమోనన్న భయం ఆమెది. పదిమందికి పెట్టిన చెయ్యే తప్ప, ఎన్నడూ చాచిన చెయ్యి కాదు. ఇప్పుడు తాను చేస్తున్నది చేయి చాచే పని కాకపోయినా ఏదో సిగ్గు. చేయకూడని పని చేస్తున్నానన్న బెరుకు. ఆ కారణంగానే అందరూ నిద్రపోయే అర్ధరాత్రి వేళ వరమ్మ లేచి పనికి పరుగులు పెడుతుంది. మోటారు సైకిళ్ళు, కార్ల మెకానిక్కు దుకాణాల ముందు పారవేసిన ఇనప తుక్కును ఏరుకుంటుంది. పనికిరాని సామగ్రిని మేస్త్రీలే షెడ్డు లోపల ఒక మూలన వేయిస్తుంటారు. నెలకో, రెండు నెలలకో వాటిని అమ్ముకుని మూడు, నాలుగువందలు వస్తే వాటితో మందో మాకో తెప్పించుకు తాగుతుంటారు. మేస్త్రి కన్నుగప్పి చిన్నాచితక సామాన్లను వేసి బుడ్డోళ్ళు ఐసుల్ని కొనుక్కుంటారు. చిన్నచిన్న ముక్కల్నీ, చీలల్నీ మాత్రం ఎక్కడవాటిని అక్కడే వదిలేస్తుంటారు. అవే వరమ్మ లాంటి వారికి వరం. ఇరవై, ముప్పై దుకాణాలు తిరిగితే మూడు, నాలుగు కిలోల తుక్కు పోగవుతుంది. ఎంత లేదన్నా కిలో ఏడు రూపాయల కన్నా కొంటారు. ఇలా రోజుకు ఇరవై పాతిక రూపాయలకు దిగులు ఉండదు. బోలెడు ఆలోచనలు చుట్టుముడుతుండగా ఇనప తుక్కు కోసం మట్టిని గెలికి దొరికిన వాటిని గోతాములో వేసుకుంటోంది. దుకాణం వెంట దుకాణాన్ని గాలిస్తోంది.

విజయవాడకు వచ్చిన మొదట్లో కొండయ్య, వరమ్మ కూలిపనులకే వెళ్ళారు. అంతంతమాత్రంగానయినా ఇటుక మోసే పనో, గుంతలు తీసే పనో దొరికేది. డెబ్బై ఏళ్ళు దాటిన వయస్సులో కాసేపు అలసట తీర్చుకోబోతే మేస్త్రీలు బండబూతులు తిట్టేవాళ్ళు. తిండిలేకపోతే చావనయినా చావచ్చుగానీ, బతికి చెడ్డ తమకు ఎదుటివారితో తిట్టించుకోవటం వల్లకాని పననుకున్నారు. పైగా కంచర్లవారిపల్లె నుంచి నగరానికి వచ్చిన వరమ్మ చిన్ననాటి స్నేహితురాలు రామతీర్థం ఓ రోజు కనపడి కూలిపనులు చేయలేక తాను ఇనుప తుక్కు ఏరుకుని బతుకుతున్నానని చెప్పింది. రామతీర్థం భర్త రాగయ్య, వ్యవసాయ ఖర్చుల కోసం చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి చనిపోయాడు.

మూడు మాసాల నుంచి ఇనుప తుక్కును ఏరుకోవటం ప్రారంభించింది వరమ్మ. గవర్నరు పేట అన్సారి పార్కుపక్కనే ఉన్న దుకాణంలో తుక్కు అమ్ముకుంటున్నది.

కిష్టప్పాలెం నుంచి ఎప్పుడో పాతిక, ముప్పై ఏళ్లనాడు నగరానికి చేరిన శ్రీనివాసరావు ఓ రోజు బజార్లో కన్పించి ఆమెను పలుకరించాడు. నగరానికి ఎందుకు వచ్చావని అడిగాడు. మొదట సిగ్గుపడింది. చివరకు చెప్పక తప్పింది కాదు. "అయ్యయ్యో ఎంత బాగా బతికిన కుటుంబం ఎట్లా అయింది" అంటూ బాధపడ్డాడు శ్రీనివాసరావు. ముప్పై ఏళ్ళ క్రితం వరమ్మ తండ్రి ఇచ్చిన మూడు వేల రూపాయలతోనే నగరానికి వచ్చి చిల్లర దుకాణం పెట్టుకున్నానని చెప్పాడు. "మీ నాయన అప్పుడు వడ్డీ కూడా తీసుకోలేదు. చచ్చి ఎక్కడున్నాడో మహానుభావుడు. ఆయన పేరు చెప్పుకుని ఇంత ముద్ద తినగలుగుతున్నాం" అన్నాడు. తన ఇంటికి రమ్మనమని పిలిచాడు. కృష్ణలంక బియ్యం కొట్ల బజారులో తన ఇంటికి ఎట్లా చేరాలో చెప్పాడు. ఏదన్నా సాయం కావాల్సి వస్తే మొహమాటం లేకుండా అడగమని ప్రాధేయపడ్డాడు. ఏదన్నా దారి దొరికిందాకా బియ్యం, పప్పు, ఉప్పు ఇస్తానని

చెప్పినా వరమ్మ వినలేదు. కాకపోతే ఎప్పుడన్నా డబ్బు లేని రోజున వెచ్చాల్ని అప్పుగా ఇవ్వమని మాత్రం కోరింది.

అలా వరమ్మ కుటుంబానికి రెండో చేయి అలంబన అయింది. తుక్కు అమ్మగా వచ్చిన డబ్బుతో అటునుంచి అటే శ్రీనివాసరావు కొట్టుకెళ్ళి ఆరోజుకు కావాల్సిన బియ్యం, కూరగాయలు కొనుక్కుని ఇంటికి చేరుతుంది వరమ్మ. ఇక మళ్ళీ అర్థరాత్రి దాకా గుడిసె నుంచి ఎటూ కదిలేది కాదు.

కొండయ్య పొద్దున ఎనిమిదింటికి బయలుదేరి పడమట బెంజి సర్కిలు మెట్టుకు చేరేవాడు. ఏదన్నా కూలి పని దొరికిందా సరేసరి లేకుంటే అక్కడ నుంచి ఒన్‌టౌన్‌కు చేరి వీధి వీధి తిరుగుతూ బజార్లో దొరికిన తాళ్ళను ఏరుకొచ్చేవాడు. వాటిని పేని సాయంత్రానికి గేదెల కట్టుతాడు, పురికొస బాగా దొరికిన రోజున దూడలకు సరిపడే తాళ్ళను కూడా పేనతాడు. వాటిని మరుసటి రోజున ఒన్‌టౌన్‌కు తీసుకుపోయి ఏ దుకాణంలోనో అమ్మితే పది రూపాయలు వచ్చేది. వరమ్మ రోజూ అంతో ఇంతో సంపాదిస్తున్నందున కూటికి ఇబ్బంది లేకుండా కాపురం సాగుతోంది.

* * *

వరమ్మ తుక్కు ఏరేందుకు బయలు దేరింది. కనపడినంత మేర చూసిన కొండయ్యకు ఆమంటే జాలి పుట్టింది. "మొన్నమొన్నటిదాకా ఎట్టా ఉండేది." గతాన్ని గుర్తు చేసుకున్నాడు. "ఐదేళ్ళ నుంచీ మాయదారి కరువు ఆవరించి ఎట్టాటోళ్ళనీ చిదిమి పారేసింది. పాతికెకరాల మాగాణి, పదెకరాల మెట్ట అంతా అప్పులోళ్ళకు పోయింది. కొడుకు చదువుకున్నా ఏ ఉద్యోగమూ రాక పని వెదుక్కుంటూ దుబాయ్ వెళ్ళాడు. అంతంత మాత్రపు ఆదాయంతో అక్కడ బతుకీడుస్తున్నాడు. పైగా పొలాలకు కాపలా పనంట. పేరుకు ఐదు వేలు జీతం వస్తున్నా అదక్కడ రొట్టెముక్కలకు కూడా సరిపోదంట. చివరకు ఊరుకాని ఊళ్ళో. అదీ పుట్టి బుద్ధెరిగి చేయని పనులు చేసి మరీ పొట్టనింపుకోవాల్సిన దుస్థితి పట్టింది". మనసు నిండా ఆలోచనలు కదులుతుండగా సద్దన్నం తినటం పూర్తి చేసి లేచాడు. పళ్ళెం కడిగి బోర్లించి తడికె లాగి బయటకు వచ్చాడు.

ఎక్కడ కిష్టప్పాలెం ఎక్కడ విజయవాడ కృష్ణలంక. కరువు ఆ రెండింటినీ దగ్గర చేసింది. రెండు వందల యాభై కిలోమీటర్ల దూరం వాటి మధ్య. గ్లోబలైజేషన్ ప్రపంచాన్ని చిన్న గ్రామంగా చేసిందనటం నిజమో కాదోగానీ కరువు, కొండయ్య కుటుంబాన్ని పల్లె నుంచి నగరానికి తెచ్చివదేసి వాటిని అనుసంధానపరచింది.

కిష్టప్పాలేన్ని, ఆ మాటకొస్తే కనిగిరి ప్రాంతాన్ని ఆవరించిన కరువు మామూలుది కాదు. విశ్వామిత్రుడు ఆకలికి తాళలేక కుక్క కళేబరాన్ని పీక్కుతిన్నంతటి కరువు. నాలుగు వర్ణ ధర్మాలనూ తూచా తప్పకుండా అమలు చేయాలన్న ఆ విశ్వామిత్రుడే దాహానికి తాళలేక దళిత స్త్రీ దోసిట పోసిన మంచినీటిని తాగినంతటి కరువు.

కొండయ్యకు పెద్దగా ఆస్థిపాస్తులు లేకున్నా, మంచివాడన్న పేరు ఉండటంతో వరమ్మ తండ్రి అతనిని అల్లుడిగా చేసుకుని ఇల్లరికం తెచ్చుకున్నాడు. మార్కొండాపురంలో అతని భాగం కింద వచ్చిన నాలుగెకరాల పొలాన్నీ, ఇంటినీ అమ్మేసి మామ చేతిలోనే పెట్టాడు కొండయ్య. పెళ్ళయిన నాటి నుంచీ కొండయ్యకు కాయకష్టం తప్ప మరొకటి తెలియదు. గత ఐదేళ్ళూ వరుస కరువుతో కిష్టప్పాలెం అతలాకుతలం అయింది.

కొండయ్య పరిస్థితీ అదే. ఆదాయాలు లేకపోగా వ్యవసాయ ఖర్చులు మాత్రం తగ్గలేదు. పైగా తోటలు ఎండిపోతుంటే చూడలేక బోర్ల మీద బోర్లు తవ్వించాడు. బోర్లు వేసేందుకు ఉన్న డబ్బంతా కరిగిపోయింది. తోటలూ ఎండిపోయాయి. మూడేళ్ళ క్రితం వర్షం పడింది కదాని రైతులు మళ్ళీ అప్పులు చేసి మరీ బత్తాయి నాటారు. తిరిగి రాకపోతుందా అని కొండయ్య కూడా పాతికెకరాల్లో తోట వేశాడు. నాలుగు మాసాల పాటు బోర్లలో అంతో ఇంతో నీరు వచ్చింది. తర్వాత పాత అగచాట్లే. మళ్ళీ కొత్తగా బోర్లు తవ్వించారు. లక్షలు ఖర్చయినా చుక్క నీరు పడిన పుణ్యాన పోలేదు.

కనిగిరి కుదువవ్యాపారి చెంచయ్య దగ్గర తెచ్చిన నాలుగు లక్షలు, ఒంగోలు యక్కలోళ్ళ ఎరువులకొట్టు బకాయి లక్షన్నర, మహలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ వాళ్ళిచ్చిన మోటార్ల తాలూకు అప్పు అరవై వేలు, మోటార్ల మెకానిక్కుకు ఇవ్వాల్సిన పన్నెండు వేలు, బ్యాంకు అప్పు రెండు లక్షలు, మరి కొంత చిల్లర మల్లర అప్పులు కలిసి అలా దాదాపు పది లక్షలకు చేరింది రుణం. తీర్చే దారి కనపడలేదు. పైగా ఏ క్షణాన కడతావో చెప్పమంటూ అప్పులోళ్ల గొడవ. దీంతో చేసేది లేక ఎవరికి కావాల్సిన పొలాన్ని వాళ్ళకు రాసేసి కొండయ్య చేతులు దులుపుకున్నాడు.

స్నేహితుడు వెళ్తున్నాడంటూ కొడుకు దుబాయికి పోతానంటూ బ్యాగ్ సర్దుకున్నాడు. కొడుకు దారి ఖర్చుల కోసం, వాడిని పంపే ఏజెంటు కమీషను కోసం మిగిలి ఉన్న ఐదెకరాలూ అమ్మేసి కొడుకు చేతిలో పెట్టాడు.

ఇక మిగిలింది తానూ, భార్య వరమ్మ. ఊళ్ళో పసులేవు. ఉన్నా పోగలిగిన పరిస్థితీ కాదు. తమ ప్రాంతం వాళ్లు ఎప్పటి నుంచో వలసపోయే విజయవాడ గుర్తుకు వచ్చింది కొండయ్యకు. తట్టా బుట్టా సర్దుకుని నగరానికి చేరారు.

* * *

రాత్రి పది గంటలు. తెల్లారితే వినాయక చవితి. పత్రి కొనుగోళ్ల పనిలో నగర వాసులు నిండా మునిగిపోయారు.

ఆ పూట ఇంకా ఇంటికి రాని కొండయ్య కోసం వరమ్మ గుడిసె బయట నిలబడి ఎదురు చూస్తోంది.

ఆ సమయంలో ఇద్దరు ఖాకీలు మోటారు సైకిల్‌మీద వచ్చి సరిగ్గా వరమ్మ ముందే దిగారు.

కొండయ్యకు జరగరానిదేదో జరిగితే పోలీసులు కబురు తెచ్చారా అన్న అనుమానం రావటంతో వరమ్మ గుండె గుభిల్లుమంది.

" ఇక్కడ వరమ్మ ఎవరు?" అడిగాడు కానిస్టేబుల్.



"నేనయ్యా" పూడుకుపోయిన వరమ్మ గొంతు పలికింది. "ఎన్టీఆర్ భవన్ దగ్గర తుక్కు ఏరుకునేది నువ్వేనా?" కర్కశంగా ప్రశ్నించింది కానిస్టేబుల్ గొంతు.

" ఆ...ఆ...ఆ..." ఏమవుతుంతో తెలియని స్థితిలో వరమ్మ తలూపింది.

"మోటారెవరికి అమ్మావ్?" హెడ్ కానిస్టేబుల్ ప్రశ్న దూసుకొచ్చింది. "మోటారేంటి బాబూ?" అయోమయంగా తిరిగి ప్రశ్నించింది వరమ్మ. "ఏమి మోట్రా, ముసల్దానివి బాగానే నటిస్తున్నావే ముండా" లాఠీతో దబదబా బాదాడు కానిస్టేబుల్.

"నిజం చెప్పకపోయావో లం... ఇక్కడే దెబ్బకు ఛస్తావు. చెప్పు రాత్రి దొంగిలించుకొచ్చిన మోటారు ఎక్కడ అమ్మావో చెప్పు".

అదేమీ అర్థం కాక వరమ్మను దుఃఖం ఆవరించింది. మోటారు ఏందో అర్థం కాలేదు. ఏమి చెప్పాలో తెలియటం లేదు. అసలు ఏమి మాట్లాడాలన్నా గొంతు పెగలటం లేదు. కన్నీళ్ళు బొటబొటా కారుతుండగా ఆమె అక్కడే కూలబడిపోయింది.

" ఏవే చెప్పింది తలకెక్కటం లేదా? యాక్షన్లు మాని అసలు విషయం చెబితే మంచిది. నేనసలే మంచోడ్ని కాదు." పళ్ళు పటాపటా కొరికి మీదకు దూకాడు హెడ్డు.

"ఇదిగో చూడు, ముసిల్దానా, ఆ మోటారు చిన్నా చితకోళ్లది కాదు. రామనరసయ్యా గారిది.... ఆయన గురించి విన్నావో? లేదో?. ఆయన తలుచుకుంటే నువ్వు కాదుగదా.......నీ జేజమ్మ కూడా దిగిరావాలి తెలుసా;?" లాఠీతో పొట్టలో పొడుస్తూ కానిస్టేబుల్ పొరం చెప్పాడు.

"మోటారేంటో నాకు తెలవదయ్యా" లాఠీతో పొడిచిన చోట పొట్ట నుంచి కారుతున్న రక్తాన్ని చీరతో అదిమిపెడుతూ వరమ్మ చెప్పింది బాధగా.

"ఏయ్ రంగా, ఇలా అయితే ఇక లాభం లేదు. దీన్ని లాక్కురా. స్టేషన్లో చూద్దాం. అక్కడగానీ దీనికి నిజం గుర్తుకు రాదు." హెడ్ హూంకరించాడు.

"నేను ఆటోలో వస్తాను. దీన్ని తీసుకుని బండిమీద రా." అంటూ రోడ్డు మీదకు నడుస్తూ ఆదేశించాడు కానిస్టేబుల్ రంగాని హెడ్.

వరమ్మను ఎక్కించుకుని కృష్ణలంక పోలీసుస్టేషను వైపు కదిలింది కానిస్టేబుల్ హీరోహోండా రాత్రి పదిన్నర గంటల సమయంలో.

* * *

ఒన్‌టౌన్, బీసెంట్ రోడ్డు, కృష్ణలంక వంతెన ఎక్కడ చూసినా గడ్డి గుట్టలు.

"పదీ...పదీ...పది రూపాయ లేనండీ." అంటూ కేకలు వేస్తున్నారు అమ్మకందార్లు.

అన్ని చోట్లా పరికించి చూశాడు కొండయ్య. చిన్న చిన్న కొండలు మాదిరిగా రోడ్ల వెంట గడ్డి వాములు. ఎందుకూ పనికి రాని గడ్డి. కనీసం కరువు ప్రాంతాల గొడ్లన్నా మేయని గడ్డి. భక్తులు పది రూపాయలు ఇచ్చి కొనుక్కుంటున్నారు. అలాంటి దృశ్యాలను ఇంతవరకూ కనీసం వినని కొండయ్య ఆశ్చర్యపోయాడు. తమ గేదెలు ఆవురావురుమని తినే గడ్డికి కూలి లెక్క గట్టినా ఇంత ధర పలక లేదు ఏనాడూ. ఏదీ దొరకని కరువులోనూ నెల్లూరు నుంచి తెచ్చుకున్న ఎండు గడ్డి కూడా మోపు పాతిక రూపాయలకు మించలేదు. దేనికీ పనికిరాని గడ్డికి పత్రి అని పేరుపెట్టగానే ఎంతంత ఆదాయమో అనుకున్నాడు కొండయ్య.

మనస్సు నిండా గతాన్నీ, ప్రస్తుతాన్నీ తవ్వి

(మిగతా 15వ పేజీలో)

ఒక్కొక్కరికో న్యాయం

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

ఇంట్లోకి తుఫానులాగా ప్రవేశించింది లలిత. "ఏమిటే ఈ హడావిడి!" అడిగాన్నేను.

"అబ్బ! చాల వేడిగా వుందే బయట. ఎండవేడి తట్టుకోలేకుండా వుంది" అంది లలిత పైన ఫ్యాన్ వైపు చూస్తూ. ఫ్యాన్‌గాలి సరిపోలేదు దానికి. పైట చెంగుతో విసురుకోవటం మొదలుపెట్టింది.

"వర్షం వస్తుందేమోనే. అందుకే ఇంత ఉడకపోస్తోంది" అన్నాన్నేను.

"వర్షం లేదు. గిర్షం లేదు. ఆ మాట మర్చిపో సుశ్రీ!" అంది లలిత.

"వర్షం రాకడ ప్రాణం పోకడ ఎవరికి తెలుస్తుంది. ఏమో వర్షం వస్తుందేమో అందుకే ఇంత వేడి" అన్నాన్నేను. నా మాట విని పకపకా నవ్వింది లలిత.

"ఎందుకే నవ్వుతావ్?" అడిగాన్నేను విస్తుపోతూ. చాలా ప్రయత్నం చేసి నవ్వాపుకొంది లలిత.

"అది కాదే... ఒక ఆడదానికి మళ్ళా పెండ్లి అవుతుందనుకో.."

"ఏమిటే విచిత్రంగా మాట్లాడుతున్నావు. మళ్ళా పెండ్లి అవుతుందనుకో... అంటావేమిటి. కాదా? కాకూడదా?" లల్లిని మధ్యలోనే నేను ఘాటుగా ప్రశ్నించాను.

"అబ్బా! నీ కోపం కొంచెం ఆపు. నేను చెప్పేది విను. ఆడదానికి భర్త చనిపోతే మళ్ళా పెండ్లి కావటం మన సమాజంలో కష్టమే. నీకు తెలుసుగద! వరకట్నాలని, అందం అనీ గిందం అనీ మొదటి పెండ్లి కన్యా వివాహం కావటమే చాలా కష్టంతో కూడుకున్న పని. ఇక స్త్రీకి మళ్ళా పెండ్లి కావటమనేది ఎంత కష్టమో ఊహించు కొంచెం" అంది లలిత.

"సరే ఊహించాను. అయితే ఏందట.." అడిగాన్నేను.

"అందులో ఆ యువతి గర్భవతో లేదా పిల్లలున్న తల్లో అనుకో మళ్ళా పెండ్లి కావటం మరీ అసాధ్యం. అవునా కాదా!" అడిగింది లలిత.

"అబ్బ! నీ సోది ఆపి అసలు విషయం చెప్పు" అన్నాన్నేను.

"సుశ్రీ! ఏదైనా సినిమాలోగాని సీరియల్లో గాని – అది తెలుగు గాని హిందీగాని ఒక భర్తచనిపోయిన యువతికి మళ్ళా పెండ్లి అయినట్లుగా చూపిస్తారనుకో. వెంటనే మొదటి భర్త ఎక్కడి నుంచో ఊడిపడ్తాడు. అప్పుడు ఈ యువతికి నరకం మొదలవుతుంది. మనోవేదన కలుగుతుంది. పెద్ద కష్టం వచ్చిపడుతుంది. ఇప్పుడు ఎవరి దగ్గరికి పోవాలి – మొదటి భర్త దగ్గరికా రెండో భర్త దగ్గరికా – పెద్ద సమస్య!"



"ఓహో! లల్లీ! నువ్వు పేపర్లో వచ్చిన గుడియా అనే యువతి గురించి మాట్లాడుతున్నావా ఏంటి?" లల్లి వాక్ప్రవాహాన్ని ఆపుతూ అడిగాన్నేను.

"అవును... గుడియా గురించి చదివితే నాకు సినిమాల్లో టీవీ సీరియళ్ళల్లో కూడా అదేవిధంగా చూపుతారు కద. ఇలా జరుగుతుందా అనుకునే దాన్ని. అది ఇప్పుడు నిజంగానే జరిగింది" అంది లలిత.

"అట్లా జరగడం నూటికో కోటికో ఎక్కడో జరుగుతుంది. కాని నువ్వన్నట్లుగా సినిమాల్లో టీవీ సీరియళ్ళల్లో ఒక యువతికి మళ్ళా పెండ్లి అయినట్లుగా చూపుతారనుకో – మనం అబ్బ ఈ నిర్మాత, దర్శకుడు స్త్రీకి రెండో పెళ్ళి జరిగినట్లుగా ఎంత విప్లవాత్మకంగా చూపాడు అని మనం సంతోషిస్తున్నాం. కాని మన సంతోషం ఇంకా చల్లారకముందే మొదటి భర్త రంగంలోకి వచ్చేస్తాడు. ఇక ఘర్షణ మొదలవుతుంది..." నా మాటలు విని నవ్వింది లలిత... నేను చెప్పింది అదేనే. ఎందుకట్లా యువతి రెండో పెండ్లిలో పుడకలు వేస్తారు ఈ దర్శక రచయితలు నాకు అర్థం కాదు. ఆ ప్రశ్నతోనే నేను ఎప్పుడూ సతమతమవుతుంటాను. అట్లాంటిది ఇప్పుడు నిజంగానే గుడియా జీవితంలో చాల సినిమాటిక్‌గా అదే సంఘటన జరిగింది. గుడియా మొదటి భర్త ఆరిఫ్ మిలిట్రీలో వున్నాడట. పాకిస్తాన్‌తో జరిగిన కాల్పుల్లో కన్పించకుండా పోయాడనే వార్తవచ్చింది. గుడియా తల్లిదండ్రులు నాలుగేండ్లు వేచి చూశారు. ఆరిఫ్ పత్తా దొరకలేదు. గుడియాకు మళ్ళా పెండ్లి చేశారు. ఆమె గర్భవతి అయింది. ఇంతలో ఆరిఫ్ పాకిస్తాన్ జెయిల్ నుంచి విడుదలై వచ్చాడు. ఊరంతా జమయ్యారు. ముస్లిం మౌల్వీలు పెద్దలు తలలు పట్టుకున్నారు. మతగ్రంథాలు న్యాయచట్టాలు తిప్పారు. ఇంకోవైపు ఆరిఫ్ గుడియా తన దగ్గరికే రావాలన్నాడు. ఆమెకు పుట్టబోయే బిడ్డను మొదట్లో వద్దని, తరువాత తానే తండ్రినై పెంచుతానని అన్నాడు. మరోవైపు రెండో భర్త శాస్త్రప్రకారం గుడియా తన భార్యేనని వాదించటం మొదలుపెట్టాడు. మత శాస్త్రాలు తిప్పేసి మతగురువులు గుడియా మొదటి భర్త ఆరిఫ్ దగ్గరికే పోవాలన్నారు. పుట్టిన బిడ్డను రెండో భర్తకు అప్పగించాలని, ఒకవేళ ఆ బిడ్డను ఆ భర్త పెంచేసోమత లేకపోతే గుడియా దగ్గరే వుంచవచ్చునన్నారు. అప్పుడు మొదటి భర్త ఆ బిడ్డను కన్నబిడ్డగా పెంచాలని నిర్ణయం చేశారు. ఆ నిర్ణయాన్ని ముగ్గురూ శిరసావహించారు. కాని అదే హిందూ సమాజంలో ఈ సంఘటన జరిగితే ఆ యువతిని గురించి ఎన్ని ప్రశ్నలు లేస్తాయో ఆలోచించు సుశ్రీ! ఆ యువతి ప్రవర్తన పాతివ్రత్యం గురించి ఎన్ని మాటలో అంటారు. ఒకసారి 'పవిత్రత' కోల్పోతే మన సమాజంలో ఆ స్త్రీకి చోటే ఉండదు. ఒక్కసారి స్త్రీకి పెండ్లి అంటే సంసారం చేసిందంటే, ఏ కారణం చేతనో భర్త చనిపోతే కన్యాత్వం కోల్పోయిన ఆ స్త్రీకి మరో పెండ్లి కావటం సాధ్యం కాదు. ఒకవేళ సంసారం చేయనట్లయితే మరో పెండ్లికి కొంచెం అవకాశం ఉంటుంది. అందుకే సినిమాల్లో నాయక కన్యాత్వానికి ఏం ప్రమాదం జరగలేదని ప్రేక్షకులకు చూపించి వాళ్ళకు విశ్వాసం కలిగించాకే ఆ నాయికకు మరో పెండ్లి చేస్తారు..." నవ్వింది లలిత.

"అంటే ఒకసారి కన్యాత్వం పోయిందంటే ఆ యువతి పెండ్లికి తగదన్నమాట. మరి మగవాళ్ళకు ఆ రూల్ లేదు ఎందుకనో! అంటే మానవుల్లోనే ఆడదానికో న్యాయం! మగవాడికో న్యాయం! ఎందుకు ఈ ద్వంద్వ ప్రమాణాలు!" అన్నాన్నేను. ❖

తుంటరోడు

మాదుగుండు కృష్ణ

నాగయ్య కొడుకు సింగయ్యది మంత్రాలయంలో పెళ్లి. బంధుమిత్రులంతా బస్సులో *మంత్రాలయం బయలుదేరారు.*

నాగయ్య సన్నిహిత మిత్రుని కొడుకు వేమరాజు. అతగాడికి అర్జంటు పనిబడి వేమరాజునొక్కడినే పెళ్లికి పంపాడు. వాడు భలే కొంటెవాడు. తుంటరి. ఏదో ఒక అల్లరి పని చేసి పేరు దక్కించుకోవాలన్నదే వాడి తపన.

బస్సులో అందరూ కబుర్లలో పడ్డారు. పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ఎవరి గోలలో వాళ్లున్నారు. వాళ్లెవరూ తనను పట్టించుకోవడంలేదనుకున్నాడు వేమరాజు. వాళ్ల దృష్టి తన వైపు మరలాలంటే ఏం చేయాలా? అని ఆలోచించాడు. ఒక ఉపాయం తట్టింది. వున్నట్టుండి టపీమని సీట్లో నుంచి కిందికి వాలిపోయాడు.

"అమ్మో! కడుపునొప్పి... అబ్బో...." అని పెద్దగా అరుస్తూ పొట్ట పట్టుకొని మెలికలు తిరిగిపోయాడు.

"ఏమైంది... ఏమైంది..." అంటూ బంధువులంతా గుమిగూడారు. డ్రైవర్ మలుపు దాటించి వేపచెట్టు దగ్గర బస్సు ఆపాడు.

"వాణ్ణి కిందకు తీసుకెళ్లండి. వేపచెట్టు నీడలో పడుకోబెట్టండి..." అని ఓ పెద్దమనిషి సలహా ఇచ్చాడు.

కంగారుగా అందరూ కలిసి వాడిని కిందకి దించారు. జంపఖానా పరచి పడుకోబెట్టారు. ఒక వ్యక్తి తన దగ్గరున్న గుళికను ఇచ్చాడు వేసుకోమని.

"కడుపునొప్పా... గిడుపునొప్పా... నాకేమైంది? దిట్టంగా వున్నాను..." అంటూ గబాల్న లేచి కూర్చున్నాడు వేమరాజు.

"మరెందుకలా అరిచావ్? మేమంతా ఎంత ఇదయ్యామో తెలుసా?" అని అడిగారు జనం.

"తమాషాకు..." అని వాలిని గేలిచేశాడు.

"ఒరే నీ మనిషిగూలా... తుంటరోడా..." అంటూ బస్సు ఎక్కడానికి వెళ్లారు. 'వాడు బాగా పోకిరీ పిల్లాడిలా వున్నాడే. ఎంత దడ పుట్టించాడు...' అనుకున్నారంతా. బస్సు ముందుకు దూసుకెళ్లింది.

పెళ్లి ఘనంగా జరిగింది. దైవ దర్శనం ముగించుకొని బంధువులంతా బస్సులో వెనక్కి బయలుదేరారు. బస్సు కొంచెం దూరం వెళ్లిన తర్వాత వేమరాజు కడుపులో మంట బయలుదేరింది. గుడ్లు తేలేశాడు.

కానీ పక్కన వున్న వాళ్లు, "చాల్లేరా... నీ అల్లరి... వేళాకోళానికైనా వేళాపాళా వుండాలి" అని తిట్టారు.

"అయ్యో... నాకు నిజంగానే కడుపునొప్పిగా వుంది. నేను తట్టుకోలేకపోతున్నాను నమ్మండి..." అని గట్టిగా అరిచాడు.

డ్రైవర్ బస్సు ఆపబోతుంటే, "వాడిది నిన్న చూసిందేగా. వాడి మాటలేవీ నమ్మకండి... పోనీ బస్సు" అన్నాడు ఓ పెద్దమనిషి.

కడుపులో మంటతో నరకయాతన అనుభవిస్తున్నట్టనిపించింది వేమరాజుకు. తన బాధను ఎలా వ్యక్తపరిస్తే నమ్ముతారో అర్థంకావడంలేదు.

నిన్న గుళిక ఇవ్వబోయిన వ్యక్తిని అడిగాడు అదే గుళిక ఇమ్మని. "చాల్లేరా నాయనా... నీ నటన. ఏం అడుగుతావ్ నన్ను? ఫూల్ చెయ్యడానికా...!" అన్నాడాయన కోపంగా.

ఏం చేయాలో పాలుపోలేదు. భరించలేని కడుపునొప్పి. నొప్పి పోయే మార్గం కనిపించదాయె. ఊరు ఇంకా చాలా దూరంలో వుంది. ఈలోపు పొట్ట పగులుతుందేమోనన్న భయం కలిగింది. బస్సు కుదుపులకు పేగులు తిప్పినట్లైంది.

ఊళ్లోకొచ్చేదాక విలవిల్లాడిపోయాడు. తనను ఎవరూ నమ్మలేదు. భోజనం బాగుందని మితిమీరి తిన్నందుకు జీర్ణంగాక ఇబ్బందిపడ్డాడు. బస్సు దిగాక ఇంటికెళ్లి నాన్నతో కలిసి డాక్టర్ దగ్గరకెళ్లాడు. ఆయన ఇంజక్షన్ చేశాకగానీ కడుపునొప్పి తగ్గలేదు.

అసత్యం ఎంత అసౌకర్యానికి గురి చేసిందో తెలిసొచ్చిన వేమరాజు మరెన్నడూ అబద్ధం చెప్పడానికి ప్రయత్నించలేదు. ❖



చిన్నారి చిత్రకారులు

ఎమ్.శాలిని, 8వ తరగతి,
లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, భద్రాచలం.



వై.రాజేష్, 10వ తరగతి,
బిసి బోయిస్ హాస్టల్, కురుపాం,
విజయనగరం.

ఎన్.రామారావు, 10వ తరగతి,
బిసి బోయిస్ హాస్టల్, కురుపాం,
విజయనగరం.

పేపర్ చైన్ !



హలో! పిల్లలూ!! ఇవాళ మీకోసం పేపర్ చైన్ తీసుకొచ్చాం. న్ని చెయ్యడం ఎలాగో చెప్తాం. చదివి చక్కగా చెయ్యాలి. సరేనా! **మేం కావాలంటే...** రంగులు, గమ్, కత్తెర, తెల్ల కాగితాలు. రంగువి ుంటే మరీ మంచిది. **ఎలా చెయ్యాలంటే...** ముందు మీరు తురస్రాకారపు కాగితం తీసుకోండి. దాన్ని మధ్యకు మడవండి. ర్వాత మళ్లీ మధ్యకు మడవండి. ఇప్పుడు కాగితం అంతా నాలుగు మాన భాగాలుగా మడతలు పెట్టినట్టన్నమాట. ఇప్పుడు కత్తెరతో లగా వున్న వైపు ... బొమ్మలో చూపించినట్టు కత్తిరించాలి. అలా అలా... చివరి వరకు కత్తిరించాలి. ఇప్పుడు పేపర్ మడతలు విప్పండి. మీకు ఇష్టమైన రంగులు అద్దండి (తెల్లటి కాగితాన్ని కత్తిరిస్తేనే). అలా దాన్ని గాలికి కాసేపు ఆరనివ్వండి. తర్వాత మడిచి పక్కన పెట్టుకోండి. ఇలా కొన్ని తయారుచేయండి. తర్వాత మెల్లగా రెంటిని తెరవండి. ఒక కాగితానికి అంచుల దగ్గర గమ్ పుయ్యండి. దాని మీద మరో కాగితం వుంచి వత్తి పెట్టండి. కాసేపు ఆరాక ... కాగితం మధ్యలో సున్నాలా వుంటుందికదా. అక్కడ గమ్ పుయ్యండి. మరో కాగితం తీసుకుని దానిలో వున్న సున్నాకు అతికించండి. ఇలా కొన్ని అతికిస్తే పేపర్ చైన్ రెడీ. దీన్ని ఎంచక్కా దర్వాజాలు, కిటికీలు; గోడలకు అలంకరించవచ్చు. అందంగా వుంటుంది. ఆగస్టు పదిహేనురోజున, పుట్టినరోజు పండుగలప్పుడు ఇంటిని వీటితో అలంకరిస్తే భలే కలర్‌ఫుల్‌గా వుంటుంది. మరి చేసి చూస్తారా!



వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?



ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో ఒక తాతయ్య వచ్చాడు. ఆయన పేరేంటో రాసి పంపుతారుగా. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

గతవారపు సమాధానం:
ఇందిరాగాంధి

సరైన సమాధానాలు రాసిన వారు

కె.శివకుమార్, 8వ తరగతి, అల్లాపూర్‌కొండ, రంగారెడ్డి. జె.రవి, 10వ తరగతి, ముజాహిద్‌పూర్, రంగారెడ్డి. కె.గణేష్, 10వ తరగతి, ముజాహిద్‌పూర్, రంగారెడ్డి. పి.శేఖర్, 10వ తరగతి, ఆమనగల్, మహబూబ్‌నగర్. సి.వెంకటేష్, మహ్మద్ రహమత్, 8వ తరగతి, మహ్మద్ అహ్మద్, ఎల్.శేఖర్, కె.సోన, 10వ తరగతి, కె.శంకర్, 10వ తరగతి, ఎల్.శ్రీను, 9వ తరగతి, కె.శ్రీనివాసులు, ఎల్.పాండు, 5వ తరగతి, బి.నరేష్, 8వ తరగతి, ఎన్.కిష్టయ్య, 8వ తరగతి, ఎల్.నాగేష్, 1వ తరగతి,యు.వెంకటేష్, 8వ తరగతి, రఘుపతిపేట, మహబూబ్‌నగర్. కె.వినయ్, 9వ తరగతి, కె.స్వామి, పి.నరేష్, ఎ.రమేష్, బి.కిరణ్, నవీన్, 9వ తరగతి, నాచ్‌నేపల్లి, వరంగల్. పి.ఎస్.వివేక్, 8వ తరగతి, వనపర్తి, మహబూబ్‌నగర్. డి. సునీల్‌గుప్తా, 6వ తరగతి, నాగూరు. బి.మురళీకృష్ణ, 9వ తరగతి, రెబ్బవరం. కె.పరిమళ, 9వ తరగతి, కొమరాడ. ఎ.రజని, 10వ తరగతి, రాజేష్, 9వ తరగతి, రాజేశ్వరి, 6వ తరగతి, రాము, 9వ తరగతి, కొమరాడ. ఎల్.సరస్వతి, 7వ తరగతి, మొద్దిపాడు.కుర్మ రవి కౌషిక్, 4వ తరగతి, జాండ్రపేట. పి.రాధ, 3వ తరగతి, పి.కార్తికేయ, 5వ తరగతి, పెదశంకరంపేట.జి.అబ్రహాం, 10వ తరగతి, గోవాడ. వి.ఎల్.తేజస్వి, 9వ తరగతి, ఉక్కునగరం. వి.బసవలింగం, 7వ తరగతి, బ్రహ్మపురం. ఎమ్.నితీష్, 5వ తరగతి, నెల్లూరు. కె.అజిత్‌చంద్, 6వ తరగతి, గుంటూరు. ఎ.హరినాథ్, 7వ తరగతి, దామరమడుగు. పి.రాజేష్, 9వ తరగతి, పి.స్వరూప, 10వ తరగతి, ఈమని. పి.గాయత్రి, 9వ తరగతి, ఇరగవరం. పి.వెంకట నారాయణ, 10వ తరగతి, కనిగిరి. వడ్డెమాని మమత, 5వ తరగతి, పులిగిల్ల, నల్గొండ.

బఫూన్లు ఎందరు?



నేస్తాలూ! ఈ వారం బాలనేస్తాలు పేజీలో రంగులు వస్తాయా? చుక్కలు కలపడం వస్తుందా? తేడాలు కనుక్కోవడం వస్తుందా? అని తెగ ఆలోచించినట్టున్నారే! ఇవాళ మీ కోసం కొత్త బొమ్మ వచ్చింది. మీ చిట్టి చేతులతో దీనికి రంగులు అద్దాలి. ఆ తర్వాత అందులో వున్న వారెంతమందో చెప్పాలి. కాకపోతే రంగులు అద్దేటప్పుడు ఒక విషయం గుర్తుంచుకోండి. అదేంటంటే... అంకెలు వున్న ప్రదేశంలో పసుపు రంగు, అక్షరాలు వున్న చోట ఎరుపు రంగు అద్దండి. అంతే మీకు చక్కటి బఫూన్లు కనిపిస్తారు. అప్పుడు అందులో ఎందరు బఫూన్లు వున్నారో చెప్పడం చాలా ఈజీ. మరి రంగులు నింపండి చకచకా. ఆలస్యమెందుకు?

అక్షరాల్లో చిక్కిన చెట్లు

J	U	N	I	P	E	R	O	P	C	A
F	W	H	X	S	S	A	I	O	S	O
R	I	Y	S	B	K	N	T	P	T	Y
E	L	R	R	A	E	T	E	U	U	R
D	L	J	P	R	O	N	L	P	N	O
W	O	E	E	N	E	C	A	U	L	K
O	W	L	W	E	N	B	E	J	A	C
O	M	O	L	U	A	A	L	D	W	I
D	O	P	E	R	X	I	C	U	A	H
D	A	S	P	R	U	C	E	E	M	R
M	C	Y	P	R	E	S	S	U	P	F

ఇంగ్లీషు పజిల్-11

చిన్నారులూ! ఈ వారపు ఇంగ్లీషు పజిల్‌లో కొన్ని చెట్లు వున్నాయి. కాకపోతే వాటిని కనిపెట్టాల్సిన పని మాత్రం మీదే. ముందు ఆ చెట్ల స్పెల్లింగ్‌ను గుర్తించి సున్నా చుట్టండి. తర్వాత వాటిని కార్డుమీద రాసి మాకు పంపండి. అంతే. మీ పేరు, మీరు గుర్తించిన చెట్ల సంఖ్యను ప్రచురిస్తాం. మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

పజిల్ 9 కి సమాధానాలు రాసిన వారు **(పేరు పక్కన వున్న నెంబరు వారు గుర్తించిన పదాలు)**

ఎమ్. వర్ధన్ బాబు (18), 5వ తరగతి, ఇంకొల్లు, ప్రకాశం. **బి.వినాయక్‌రావు (16)**, 8వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **వి.విష్ణువర్ధన్ (19)**, 9వ తరగతి, మహబూబ్‌నగర్. **బి.పద్మావతి (18)**, 6వ తరగతి, గుంటూరు. **కె.కరుణాకర్ (22)**, **బి. పద్మావతి, కె. వీర వెంకట నాగబాబు**, 10వ తరగతి, లక్ష్మీనగర్, మెదక్.

ఇంగ్లీషు పజిల్-10 జవాబులు

OIL
PEANUTS
PEANUT BUTTER
CANDY
COOKIES

వి'చిత్రం'



హాయ్! ఇవాళ వి'చిత్రం' చూశారుగా. ఇందులో ఎవరెవరు ఏం చేస్తున్నారో చెప్పండి. ముందే చెప్తున్నాం. బాగా పరిశీలనగా చూసి ఆ తర్వాతే చెప్పండి. తప్పు చెప్పి తర్వాత చేతులు విదుల్చుకోకూడదు. సరేనా! 'అబ్బా... దీనికి కూడా అంత పరిశీలనగా చూసి చెప్పాల్సినదేం లేదు. ఇవాళ్టి వి'చిత్రం'లో నలుగురు వ్యక్తులు వున్నారు. వాళ్లు... వాళ్లు... మెట్లెక్కి...మెట్లెక్కి.... కిందకి వెళుతున్నారో! పైకి వెళ్తున్నారో తెలీడంలేదే' అంటున్నారు నేస్తాలంతా. మరి అదే. మేం చెప్పింది కూడా. బాగా చూసి చెప్పమంది అందుకే. సరే మేమే చెప్పేస్తున్నాం.

నిచ్చెన దగ్గర ఇద్దరు వ్యక్తులు వున్నారు కదూ. వారిలో ఒకరు పైకి ఒకరు కిందకి వెళుతున్నట్టు కనిపిస్తుంది. కానీ ఇద్దరూ పైకే వెళుతున్నారు. ఇదే విధంగా ఇద్దరు వ్యక్తులు మెట్ల దగ్గర వున్నారు. వారిలో ఒకరు పైకి, ఒకరు కిందకి వెళుతున్నట్టు కనిపిస్తుంది. కానీ ఇద్దరూ పైకే వెళుతున్నారు. నిజ్జంగా చాలా వి'చిత్రం'గా వుంది కదూ. ఇదే మరి ఆ ఆర్టిస్టు అంకుల్ గొప్పతనం. మరి వచ్చేవారం మరో వి'చిత్రం'తో మీ ముందుకు వస్తామే.

❄

ఆకాశం నిర్మలంగా ఉంది.

ఎత్తయిన కొండ... కనుచూపు మేర విస్తరించిన పర్వత పంక్తులు.

పర్వతశిఖరం వద్ద చిన్నటెంటు... టెంటు ముందు కుర్చీలు, చిన్న వేదిక... వచ్చిన వారందరూ అక్కడ ఆశీనులయ్యారు. అందరిలోనూ ఉత్సాహం తొణికిసలాడుతోంది. కార్యక్రమం ఎప్పుడు మొదలవుతుందా అని ఎదురుచూస్తున్నారు. మరికొంతమంది ట్రెక్కింగ్ సామాగ్రిని సర్దుకుంటున్నారు.

[illegible]

పాత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

ఇంగ్లండులో హ్యారిసన్ రాక్ ప్రాంతం. పధ్నాలుగు వేల అడుగుల ఎత్తున్న డోంగ్రీ పర్వతం ఆ సమీపంలోనే ఉంది. ట్రెక్కింగ్ చేయడానికి బయలుదేరే బృందానికి వీడ్కోలు పలకడానికి ఏర్పాటైన సమావేశం ఇంకా మొదలుకాలేదు. నిర్వాహకులు హడావుడిగా తిరుగుతున్నారు. పర్వతం ఎక్కే బృంద నాయకుడు మేథ్యూస్ వివరాలను, వ్యక్తులను సరిచూసుకుంటున్నాడు.

ప్రపంచం మొత్తంలో పర్వతారోహణ చేయడానికి ఆసక్తి కలిగిన 20 మంది బృందం అక్కడ వుంది. ఆహ్వానించిన దరఖాస్తులలో ఉన్న అర్హతలు, అభ్యర్థులకున్న ఆసక్తుల ఆధారంగా ఎంపిక చేసి ఆహ్వానించారు.

ఎంపిక కాబడిన బృందంలో కాంచన్ ఉంది.

ఆమె పశ్చిమ బెంగాల్‌లో కలకత్తా వాస్తవ్యురాలు. ప్రాథమికస్థాయి నుంచి డిగ్రీ పొందేవరకూ విద్యాభ్యాసం అంతా కలకత్తాలోనే కొనసాగింది. ఇరవై ఏడు సంవత్సరాల వయస్సులోనే ఎన్నో విషయాలను నేర్చుకుంది. చదువులో రకరకాల కోర్సులను పూర్తి చేసింది.

చిన్నతనం నుంచి పర్వాతారోహణ పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. బెంగాల్‌లో జరిగే అన్ని ట్రెక్కింగ్‌లలో కూడా ఆమె పాల్గొనేది. ఎత్తయిన పర్వతాలను ఒక్కొక్క అడుగు వేస్తూ పైకి చేరుకోవడం ఆమెకు ఎంతో ఇష్టం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జరిగే ట్రెక్కింగ్ కార్యక్రమాలన్నింటినీ అధిరోహించింది.

ఆ సమయంలో డోంగ్రీ పర్వతారోహణ గురించి తెలిసింది.

అంతవరకూ పర్వతారోహణలో తనకున్న అనుభూలను వివరిస్తూ ధృవపత్రాలను పంపుతూ దరఖాస్తు పంపింది. కాంచన్ దరఖాస్తు, ఆమె వివరాలు నిర్వాహకులకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. నిటారుగా ఉండి, సూది మొనల వంటి రాళ్ళున్న రాక్ పర్వతాన్ని అధిరోహించడం ఆమెకు కష్టం అవుతుందని భావించారు. అయినప్పటికీ ఆమెకున్న ఆసక్తిని చూసి ఎంపిక చేశారు.

ట్రెక్కింగ్‌కు రమ్మని వచ్చిన ఆహ్వానాన్ని చూసి కాంచన్ ఎంతగానో పొంగిపోయింది.

తన కోరిక సఫలం కాబోతున్నందుకు ఆనందించింది.

ట్రెక్కింగ్ కోసం ఇంగ్లండు చేరుకుంది. ఆలోచనల్లో ఉండగానే సమావేశం ప్రారంభమైంది.

డోంగ్రీ పర్వతానికి సంబంధించిన వివరాలను నిర్వాహకులు వివరించారు. ట్రెక్కింగ్ కోసం సమకూర్చిన సూట్లు వేసుకున్నారు. ఆహారం, వాటర్ బాటిళ్ళు ఇతర సామగ్రి కలిగిన కిట్లును తగిలించుకున్నారు. కాంచన్ కూడా అందరితోనూ అడుగులు ముందుకు వేసింది. డోంగ్రీ పర్వతం అధిరోహించడానికి ముందుకు సాగింది.

వారం రోజుల పాటు ఆ కార్యక్రమం జరిగింది.

బృందంలో సభ్యులంతా మధ్యమధ్య విశ్రాంతి తీసుకుంటు గమ్యానికి బయలుదేరారు.

ఇతర పర్వతాలకు, డోంగ్రీ పర్వతానికి తేడా ఉంది.

ఈ పర్వతం అక్కడక్కడ గోడ మాదిరిగా ఉండటంతో నిచ్చెన మాదిరి ఎక్కవలసివచ్చేది. అయినప్పటికీ కాంచన్ ఇబ్బంది పడలేదు. అనుకున్న లక్ష్యం ఛేదించాలన్న పట్టుదల అడుగులు ముందుకు వేయించింది. వేస్తున్న ఒక్కొక్క అడుగు వల్ల ఎక్కవలసిన దూరం తరిగిపోతున్నదని కాంచన్ భావించేది.

అందరితో పర్వతాన్ని అధిరోహించింది.

పర్వతశిఖరాన్ని చేరుకున్న ఆమె ఎంతో సంతోషపడింది. హాయిగా ఊపిరి పీల్చుకుంది. "నేను సాధించాను"! అంటూ బిగ్గరగా అరిచింది. ఆమె ఆనందాన్ని చూసి మిగిలిన సభ్యులు కూడా ఆనందపడ్డారు. పరస్పరం అభినందించుకున్నారు.

కలకత్తాకి చెందిన కాంచన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది.

తండ్రి రవాణా రంగంలో వ్యాపారం చేస్తున్నారు. తల్లి గృహిణి. పెద్దక్క స్వరూప డాక్టర్‌గా పేరుపొంది మంచి ప్రాక్టీస్ చేస్తున్నారు. రెండవ అక్క రూప చార్టర్డ్ ఎకౌంటెంట్ (సిఏ) చేసి పెద్ద ఆఫీసును నిర్వహిస్తోంది. ఇంట్లో అందరికన్నా చిన్నదైన కాంచన్ మాత్రం రకరకాల రంగాల్లో తన కృషిని కొనసాగించింది.

చదువు పట్ల ఆసక్తితో పాటు న్యాయవాదిగా నిలబడాలి, ఎంతోమంది పేదల తరుపున వాదించాలన్న పట్టుదలతో న్యాయశాస్త్రం చదివింది. 2001లోనే పట్టాను పొంది న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించింది. కలకత్తాలో ఆమె కార్యాలయానికి వచ్చేవారు నిరుపేదలు, అన్నార్తులు. ఎక్కడా న్యాయం లభించని బడుగు జీవులే.. వారి కోసం నల్లకోటు ధరించి ఆమె ఎన్నో కేసులను వాదించింది. వారిని గెలిపించింది. మొదట్లో కొంతకాలం పేరున్న న్యాయవాది వద్ద సహాయకురాలిగా పని చేసినప్పటికీ తర్వాత స్వతంత్రంగా ప్రాక్టీసు ప్రారంభించడానికి స్వంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంది. తనకు చేదోడు వాదోడుగా ఉండటానికి ఇద్దరు మహిళల్ని సహాయకులుగా నియమించుకుంది.

న్యాయశాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. చదువు పట్ల తనకున్న ఆసక్తిని కొనసాగించడానికి సోషల్ సైన్స్ కూడా చదవాలని నిశ్చయించుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కాలేజీకి వెళ్లడం సాధ్యం కాదని ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పేరు నమోదు చేసుకుంది. నిరంతర దీక్షతో చదివింది. సోషల్ సైన్సులో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలై అందరి ప్రశంసలు పొందింది.

ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవలసింది ఎంతో ఉంది అని నమ్మే వ్యక్తి కాంచన్. అందుకే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సంస్థ ద్వారా మానవ హక్కులపై డిప్లొమా కోర్సు పూర్తి చేసింది. ప్రపంచం మొత్తం పైన మానవ హక్కులు ఎలా అమలవుతున్నాయి, ఇందులో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి వంటి విషయాలను తెలుసుకోవడానికి ఈ కోర్సు ద్వారా కాంచన్‌కు అవకాశం కలిగింది.

చదువుకున్న స్థాయి నుంచి వివిధ విషయాలపై ఆసక్తి చూపే కాంచన్ 1994లో కళాశాల స్థాయిలో స్కేటింగ్ ప్రతిభ చూపినందుకు అప్పటి రాష్ట్రపతి నుంచి ప్రశంసలు పొందింది. అప్పటి స్కేటింగ్‌లో పొందిన అనుభవాలను పిల్లలకు వివరించడం ద్వారా ఉపాధ్యాయినిగా కూడా గుర్తింపు పొందింది కాంచన్.

ప్రకృతిని ప్రేమించే కాంచన్ నదీ ప్రవాహాల వద్ద గడపడం అంటే ఇష్టపడుతుంది. రకరకాల పక్షుల కిలకిలారావాలను వినడం కూడా ఆమెకు ఎంతో ఆసక్తి. నిరంతరం ఈ కార్యకలాపాల్లోనే మునిగి తేలుతుంటుంది.

న్యాయవాదిగా స్వచ్ఛంద, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం.. ఎంతోమందికి సేవా కార్యక్రమాలు అందించడం వంటి పనుల్లో నిత్యం బిజీగా ఉంటున్నప్పటికీ కాంచన్ ప్రకృతి ప్రేమికురాలిగా ఉండటానికి ఇష్టపడుతుంది.

* * *

ఆడిటోరియం నిండుగా ఉంది. వివిధ శాఖలలో ప్రముఖులైన వారంతా హాజరయ్యారు.

వేదిక ముందు వరుస కుర్చీలలో కూర్చుంది కాంచన్. ఆమె మనసు ఉద్విగ్నంలో ఉంది.

విస్కామ్స్ ఉపకారవేతనం మంజూరైన సందర్భంగా పంపిణీపత్రం ప్రదానం చేసేందుకు ఏర్పాటు చేసిన సమావేశం.

బౌద్ధుల మతగురువు దలైలామా ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న శాంతి సంస్థ, శాంతి కోసం కృషి చేసే అరుదైన వ్యక్తులకు ఈ ఉపకార వేతనాన్ని మంజూరు చేస్తుంది. ఈ స్కాలర్‌షిప్ కింద రు.1.50 లక్షలు మంజూరు చేస్తుంది. ఈ సొమ్ముతో శాంతి ప్రక్రియకు అవసరమైన చర్యలు చేపట్టడం, పర్యటనలు చేయడం, పుస్తకాల ప్రచురణ చేయడం వంటి పనులు చేపట్టవచ్చు.

భారతదేశంలో వివిధ కారాగారాల్లో మహిళా ఖైదీలు ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు, వారి సాధక బాధకాల విషయంలో అధికారులు స్పందిస్తున్న తీరు... ప్రభుత్వం ఏ మేరకు పట్టించుకుంటుంది అన్న విషయాలను అధ్యయనం చేసినందుకు కాంచన్ పురస్కారానికి ఎంపికైంది. భారతదేశంలో మహిళలకు మొదటిసారి లభించిన ఈ పురస్కారానికి కాంచన్ ఎంపిక కావడం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేశారు.

స్కాలర్‌షిప్ మంజూరుపత్రం ప్రదానం చేయడానికి న్యూఢిల్లీలో సమావేశం ఏర్పాటుచేసి కాంచన్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె తల్లిదండ్రులతో కలిసి న్యూఢిల్లీకి వచ్చింది.

న్యూ ఆడిటోరియంలో సమావేశానికి వచ్చింది. ఆ తర్వాత కార్యక్రమం ప్రారంభమైంది.

నిర్వాహకులు ఒక్కొక్కరిని వేదికపైకి ఆహ్వానించారు. దేశ రాజధానిలో చాలామంది ప్రముఖులు విచ్చేశారు.

సమావేశం ప్రారంభమైంది. దలైలామా స్థాపించిన శాంతి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను శాంతికోసం కృషి చేస్తున్న వ్యక్తులకు మంజూరు చేస్తున్న స్కాలర్‌షిప్‌ల గురించి వివరించారు. తర్వాత కాంచన్‌ని వేదికపైకి ఆహ్వానించారు.

ఇద్దరు మహిళాసభ్యులు తోడురాగా వేదిక ఎక్కింది.

శాంతి సంస్థ మంజూరు చేసిన స్కాలర్‌షిప్ పత్రం, చెక్‌ను అందుకుంది. చాలామంది కాంచన్ చేసిన కృషిని వివరించారు. ఆమెకు మంజూరైన స్కాలర్‌షిప్ సార్థకత పొందుతుందని శాంతి ప్రక్రియకు ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు.

తర్వాత కాంచన్‌ను మాట్లాడమన్నారు.

ఆమె మైకు వద్దకు వచ్చింది.

“మనిషి జీవితం చిన్నది... ఉన్న జీవితంలో సగభాగం నిద్రకుపోతుంది. మిగిలిన భాగం బాల్యం, వృద్ధాప్యంలో ఏమీ చేయలేము. చేయగలిగిన తక్కువ కాలంలోనే ఏదైనా సాధించాలి. ప్రకృతిని నేను ప్రేమిస్తాను.... ఆరాధిస్తాను. ఆ ఆరాధన నా వృత్తి పట్ల, చదువు పట్ల చూపించాను. రకరకాల చదువులు చదివాను... నాకు పర్వతాలు ఎక్కడం అంటే ఎంతో ఇష్టం... అందులో కూడా పురస్కారాలను పొందాను. 1996లో తోంగ్లూ అనే శిఖరాన్ని ఎక్కుతున్న సమయంలో గాయపడ్డాను. కొండపైనుంచి దొర్లుతూ వచ్చిన రాయి నా కాళ్ళపై పడి మోకాలిచిప్ప పగిలిపోయింది. అప్పటితో నా కార్యక్రమం ఆగిపోతుందని అనుకున్నారు. ఆ తర్వాత పద్నాలుగు వేల అడుగుల ఎత్తులో వున్న దొంగ్రీ శిఖరాన్ని అధిరోహించాను.” ఆమె ఆగింది.

వచ్చిన వారు ఆమె చెబుతున్న విషయాల పట్ల ఎంతో ఆసక్తిని చూపించారు. తర్వాత కాంచన్ మళ్ళీ తన ప్రసంగాన్ని కొనసాగించింది – “న్యాయవాదిగా ఎంతోమందికి సేవలు చేయాలని అనుకుని న్యాయశాస్త్రం చదివాను. న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించాను. సమాజంలో ఆడవాళ్ళు అన్నా, వికలాంగులు అన్నా కొంత చిన్నచూపు ఉంది. దానిని తొలగించాలని ప్రయత్నిస్తున్నాను. ప్రతి మనిషిలోనూ ఏదో లోపం ఉంటుంది. కొంతమందికి వినపడక పోవచ్చు. మరికొందరికి కనబడకపోవచ్చు. ఇంకొందరు నడవలేకపోతుంటారు. వివిధ రకాల లోపాలు ఉండటం అపరాధం కాదు. ప్రజలంతా ఎన్నో రకాల సమస్యలతో బాధ పడుతుంటారు. రాజీలేని కృషి రాణింపునకు నాంది పలుకుతుంది. వ్యక్తికి గౌరవాన్ని ఆపాదిస్తుంది. విజయానికి వారధి అవుతుంది. నేను ఆ విధంగానే కృషిచేస్తున్నాను...” కాంచన్ ఉపన్యాసాన్ని ముగించింది. తర్వాత నల్ల కళ్ళద్దాలను సవరించుకొని తన సీట్లో కూర్చుంది.

ప్రేక్షకులు కొట్టిన చప్పట్లతో ఆడిటోరియం మారుమోగిపోయింది. తర్వాత సభా కార్యక్రమాలు జరిగాయి.

సభ ముగిసే సమయానికి ముందు సభాధ్యక్షులు మైకు అందుకున్నారు... “శాంతి సంస్థ స్కాలర్‌షిప్ అందుకున్న కాంచన్ గూర్చి ఒక్కమాట చెప్పడం మరచిపోయాను....” అంటు “శరీరకలోపం ఉంటే ఎందుకూ పనికిరామని కృంగిపోతుంటారు. అవయవ లేమి లోపంగా చూడకుండా కాంచన్ ఎన్నో విజయాలు సాధించారు. ఇతరులకు సాధ్యం కానివి సుసాధ్యం చేశారు. ఇన్ని విజయాలు సొంతం చేసుకున్న కాంచన్ అంధురాలు... అవును ఈమె కనిపించని అంధురాలు కాదు. చూపున్న అంధురాలు... ఏ స్థాయికి అయినా చేరుకోవచ్చునని నిరూపించిన జ్ఞాననేత్రం కలిగిన త్రినేత్రురాలు. నా దారి ఎందరికో ఆదర్శమని దారి చూపిన పథ ప్రదర్శకురాలు...” అన్నాడు.

పుట్టుకతోనే మూతబడిపోయిన కనురెప్పలను కప్పి ఉంచిన నల్ల కళ్ళద్దాల కింద నుంచి కాంచన్ కళ్ళలో చేరిన తడి జాలువారింది.

బలిపీఠం

(9వ పేజీ తరువాయి)

పోస్టు నడుస్తోన్న కొండయ్య తన ఇంటికి వెళ్ళేందుకని రాఘవయ్యపార్కు వంతెన దిగి, కృష్ణలంక కట్ట మీదకు చేరే సమయంలో వేగంగా వచ్చిన హైదరాబాదు హైటెక్కు ప్రైవేటు బస్సు అతనిని ఢీకొట్టి వెళ్ళిపోయింది. వెనుక చక్రం ఎక్కటంతో తలంతా చిదురు చిదురయింది. రక్తం మడుగు కదుతుండగా కొద్దిసేపు విలవిలా కొట్టుకుని ప్రాణం విడిచాడు కొండయ్య.

దూరంగా ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చేసరికే కొండయ్య శవమయ్యాడు. గుర్తించని శవం అంటూ కొండయ్య భౌతికకాయం మరుసటిరోజు ఉదయానికి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి చేరింది.

* * *

కృష్ణలంక పోలీసు స్టేషనులో ఆ రోజూ పోలీసులు రెచ్చిపోయారు. పల్లెటూరి ముసలమ్మ చేత దొంగతనం ఒప్పించలేకపోవటం నారికి అవమానంగా తోచింది. కోపం కట్టలు తెంచుకుంది. లాఠీలకు రకరకాలుగా పని పెట్టారు. వరమ్మ పెట్టిన ఆర్తనాదాలు మిన్నంటి విన్పించాయి. చవితి వేడుకలకు నగరం ముస్తాబవుతుండగా, అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆమె మూలుగులకు తెరపడింది.

“మోటారు దొంగతనం కేసులో నిందితురాలు వరమ్మ కాలకృత్యాలు తీర్చుకునేందుకని మరుగుదొడ్డికి వెళ్ళి అక్కడే కిటికీకి తన చీరతో వినాయక చవితినాడు ఉదయం ఏడు గంటలకు ఉరివేసుకుంది.....” దినపత్రికల స్థానిక కార్యాలయాలకు నగర పోలీసు కమిషనరేట్ నుంచి సుదీర్ఘ ప్రకటన అందింది అదే రోజు సాయంత్రం.

* * *

“పోస్ట్” అంటూ కేకపెడుతూనే విదేశాల్లో బంధువులు ఉన్నారా? సార్.” అంటూ శ్రీనివాసరావును ప్రశ్నిస్తూ పోస్ట్‌మేన్ ఓ కవరును అందించాడు. విదేశీ ఉత్తరం అనగానే అది వరమ్మ కొడుకు నుంచేనని అనుకున్నాడు శ్రీనివాసరావు. చవితి రోజు నుంచీ వరమ్మగానీ, కొండయ్యగానీ సరుకులకు రాకపోయినా, కనీసం పలకరించటానికి కూడా రాలేదని అప్పుడు గుర్తుకు వచ్చింది.

వెంటనే లేచి వరమ్మ ఇంటికి బయలు దేరాడు.

గుడిసె తలుపు తీసే ఉంది. లోపలికి వెళ్ళి చూస్తే ఎవరో నిద్రపోతూ కన్పించాడు. అతన్నెప్పుడూ చూడలేదు. దీంతో అనుమానమొచ్చింది. వరమ్మ బంధువు అనుకోవటానికి కూడా వీల్లేకుండా మట్టికొట్టుకుపోయి ఉన్నాడు. అయినా ఏమన్నా చెబుతాడేమోనని లేపాడు. వాడు లేస్తూనే తేరపారజూసి భయంతో బయటకు పరుగులు తీశాడు. చుట్టూ చూశాడు శ్రీనివాసరావు. అన్నం గిన్నె దొర్లిపోయి ఉంది. నేల మీద చెల్లాచెదురుగా పడిఉన్న మెతుకులు ఎండిపోయి కన్పించాయి. దీంతో అనుమానం పెరిగింది. ఏమయి ఉంటుంది. ఒకవేళ ఊరికి గనుక పోయిఉంటే తనకు చెప్పే పోయేవాళ్ళు. అదీగాక అక్కడేముందని పోతామని వరమ్మ ఎప్పుడూ అనేది. బయటకు వచ్చి పక్క గుడిసెలో వాళ్ళను పిలిచి అడిగాడు. కొండయ్య పండగ ముందు రోజు నుంచీ కనపడటం లేదనీ, ముసలమ్మను మోటారు దొంగతనం కేసులో పోలీసులు తీసుకుపోయారనీ చిన్నగా గొణిగి ఇంటాయన గబాగబా లోపలికి వెళ్ళిపోయాడు.

శ్రీనివాసరావుకు అర్థం అయింది. పండగనాడే కృష్ణలంక పోలీసు స్టేషనులో ఎవరో ముసలమ్మ చనిపోయిందని జనం చెప్పుకున్నారు. ఆ ముసలమ్మే వరమ్మ అని ఊహించాడు. సన్నగా వణుకు ప్రారంభం అయింది. తనకేమీ తెలియనట్లే తిరుగుముఖం పట్టాడు. చేతిలో ఉన్న ఉత్తరాన్ని ముక్కలు చేసి మురుగుకాలువలో విసిరేశాడు. కొండయ్యా, పోలీసులో తనను అడిగితే ఏమి చెప్పాలో ఆలోచించుకుంటూ ఇంటికి చేరాడు. కొట్లో గుమిగూడిన వాళ్ళకు సరుకులు కట్టివ్వటంలో మునిగిపోయాడు.

“ వరమ్మ సరే మరి కొండయ్య ఏమయినట్లో ” మనసు పదే పదే గుర్తు చేస్తుండగా , ఆ వ్యవహారాన్నంతా మరచిపోయేందుకు తీవ్రంగా ప్రయత్నించి విఫలమవుతున్నాడు శ్రీనివాసరావు.

(రోజూ వేకువజాము మూడు గంటల సమయంలో విజయవాడ గవర్నరుపేట హెల్త్ ఆసుపత్రి రోడ్డులోని మెకానిక్కు షెడ్ల ముందు ఇనుప తుక్కు ఏరుకునే వృద్ధురాలికి ఈ కథ అంకితం.)

దసరా పులి

లక్ష్మి

నా చిన్నతనంలో-

ఏ పండగొచ్చినా సందడిగా వుండేది!

ఇప్పుడు-

ఎంతగొప్ప పండగొచ్చినా దండగనిపిస్తోంది!

ఈ తేడా ఎందుకొచ్చిందంటారు? ఆన్సరు తెలిస్తే సింపులుగా ఒకే ఒకముక్కలో చెప్పండి. తెలీకపోతే ఏమీ చెప్పకుండానే పెదవి విరిచేయండి!

అంతేగానీ-

ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా మారిపోయిందనీ...మరోటనీ పెద్దపెద్ద మాటలుపయోగించి దయచేసి మెదడు తినకండి!

ఇప్పుడు కూడా-

పిల్లలకు పండుగలు గొప్ప సరదాగానే వుంటాయి. స్కూళ్ళకు ఎంచక్కా సెలవలిస్తారు. ఇంటో పిండివంటలు చేస్తారు. ఇంతకంటే ఇంకా ఏంకావాలి?

ఎటొచ్చీ-

పెద్దవాళ్ళకే తేడాలు కనిపిస్తుంటాయి!

ఒకప్పుడు వాళ్ళుకూడా పిల్లలే అయినా...ఇప్పుడు ఖర్మకొద్దీ పెద్దవాళ్ళయిపోయేరు గదా! బరువు బాధ్యతలు మోసేవాళ్ళుగా మారిపోతారు గదా!

అంచేత-

పండుగనగానే గుండెల్లో దడ పెరుగుతుంది!

ఇంటిల్లిపాదికీ కొత్తబట్టలు కొనాలి. కష్టమనుకుంటే...కనీసం పిల్లలకైనా ఆ ఏర్పాటు చేయాలి!

అదీకాకుంటే-

ఇల్లుపీకి పందిరి వేస్తారు పిల్లలు!

కొత్తబట్టలు తప్పనిసరవుతాయి! అంతటితో ఆగిపోదు పండుగ. రకరకాల పిండివంటలు కూడా చేయాలి!

ఈ ఖర్చులకోసం అప్పులు చేయాలి!

కొత్త అప్పుల్లేకుండా మామూలు రోజుల్లాగానే పండుగరోజు కూడా ఎంతో గుట్టుగా మోస్టు ఆర్డినరీగా గడిపేస్తే వచ్చే నష్టమేమిటని పెద్దవాళ్ళు గుట్టుగానే ప్రశ్నించవచ్చు!

పెద్దవాళ్ళ గుండెచప్పుళ్ళు...

పిల్లలెందుకు పట్టించుకుంటారు?

పండగంటే పండగలాగానే...

గడవాలని పట్టుపడతారు!

ఆ మాటకొస్తే- చిన్నప్పుడు మనం కూడా అంతేగా! అందులో ఇది మామూలు పండగ కాదు. మామూళ్ళ పండగ! దసరా పండగ!

దసరా పండగ...గొప్ప సరదాగా గడపవలసిన పండగ. పంతుళ్ళ పండగ. అయ్యవారికి చాలు అయిదు వరహాల పండగ. పిల్లలకు పప్పుబెల్లాల పండగ. ముఖ్యంగా ఇది పిల్లల పండగ!

విల్లంబుల పండగ. వేషాల పండగ. పులుల పండగ. ఈ రోజుల్లో పులులు వీధినపడి తిరుగుతుంటాయి!

ఇంటో పులులు గురించి చెప్పక్కర్లేదు!

వాటికి ప్రతిరోజూ దసరానే!

ప్రత్యేకించి పులివేషాలు కట్టకుండా పులుల మాదిరి గర్జిస్తుంటాయి!

ప్రతినెలా మొదటివారం -

జీతాలు పుచ్చుకున్న పాపానికి భయంకరంగా గర్జిస్తుంటాయి!

ప్రతి చిన్న విషయాన్నీ పెద్ద రాద్ధాంతం చేసి గాండ్రిస్తుంటాయి. రెండోవారానికి ఆ గాండ్రింపు కొంచెం తగ్గు మొహం పడుతుంది!

అయినా-

వేణ్ణీళ్ళెక్కడ తగలెట్టేవని దబాయింపు ధోరణి మాత్రం తగ్గదు. మూడోవారంలో కాఫీ నీళ్ళని కూడా అదే పద్ధతిలో అడుగుతుంటాయి.

ఎటొచ్చీ-

నాలుగో వారంలో నీరసపడుతున్న తమ జాతకానికి చింతిస్తూ వుంటాయి. చిల్లరకోసం మొహం వాచి వుంటాయి గనక- సిగ్గుపడుతూ వుంటాయి. పోపుల డబ్బాలు వెతుకుతూ వుంటాయి. ఫలితం కనిపించకపోవడంతో అభిమానం చంపుకుని – 'చిల్లర డబ్బులేమైనా వుంటే చూద్దూ' అని భార్యామణిని అడుక్కుంటూ వుంటాయి!

మళ్ళా మొదటి వారంలో అడుగుపెట్టగానే –

పులుల విజృంభణ మళ్ళా మొదలవుతుంది!

గర్జింపులూ గాండ్రింపులూ అధికమవుతాయి. అవి చివరి వారం వరకు సాగి ఆగిపోతాయి 'చిల్లర డబ్బులేమైనా వుంటే చూద్దూ' అనే వేడికోళ్ళు విరివిగా వినిపిస్తుంటాయి!

ఇంటో ప్రజలు ఈ విన్యాసాలతో ఏడాది పొడుగునా యింత బిజీగా వుంటున్నప్పుడు – దసరా పులులను ఏం పట్టించుకుంటాయి?

అంచేత –

దసరా పులుల్నీ, శక్తి పటాలను మా ఆడవాళ్ళూ పిల్లలు మాత్రమే అధిక సంఖ్యలో ఆదరిస్తున్నట్టు లెక్కలు చెబుతున్నాయి! ❖

తెలంగాణా విమోచనం

కాలువ మల్లయ్య



“ఇగో... నీకు గీ సంగతెరికేనా...?”

“ఏం సంగతో చెప్పకుండనే గీ సంగతెరికేనా అంటేందోయ్ ఎంకట్రాం...? తుపాకి రామునోలె మాట్లాడవట్టివి....”

“ఎహ నీయవ్వ...! మాట పురాగ నోట్లె నుంచి ఎల్లక ముందే దెబ్బమీద దెబ్బ గొట్టవట్టివి... నీకు నోటి దురుసెక్కో గదోయ్ రాజవీరు...! ఎప్పుడు ఎవ్వల మీది కెగవడన్ననే సూత్తవు...”

“అబ్బో...! ఇగ నీకేమో నోట్లెకెల్లి మాటే ఎల్లది, నాకేమో నోటి తీటెక్కువ గద...? నువ్వే ఏదోటి దీత్తవు... ఇతర్లనంటువు... నీ మాటెట్లున్నదంటే మైలు పొడుగు రాగం దీసి బెత్తెడంత పాట పాడినట్టుంది... నువ్వు చెప్పదలుచుకున్న సంగతేందో చెప్పలేవు....”

“గది సెప్పుతనంటేనే నువ్వు కుంటెనకాలోలె నడిమికి రావట్టివి... ఇగో... గా కాషాయం పార్టోల్లు లేరా...?”

“ఎక్కడున్నరు? ఇక్కడయితే కనవడుత లేరుగద... ఆల్ల గవర్నమెంటున్నప్పుడు నాదా పార్టీ అని సానమందే ముందుకచ్చింద్రు...”

“అరె నీయవ్వ... నేను చెప్పేదాక కొంచెమోపిక పట్టలేవు...”

“చెప్పేదేదో ముక్కు సూటిగ చెప్పక ఊరిచ్చి సంపవడితివి... ఇగ నేనోపికవడ్తన్న... ఏం జెప్పుతవో సెప్పు...!”

“వాళ్ళు కొన్నొద్దుల వట్టి జోరుదారుగ మాట్లాడుతంద్రెరికేనా...? తెలంగాణ విమోచనదినం జోరుదారుగా జరుపన్నారు.. గవర్నమెంటోల్లు జరుపకుంటె వాళ్ళే జరుపుతమని వీధులకెక్కుతంద్రు...”

గా మాటలకు పక్కడపక్కడ నవ్వబట్టింద్రందరు..

రాజవీరు మాత్తురం నవ్వత లేదు..

“ఏంది రాజవీరు..! అందరు నవ్వుతంటె నీకు నవ్వత్తలేదా..? నిన్ను సూత్తాంటె కాపులు కర్నాలు సామెత యాదికత్తంది...”

“గాల్లమాటలు నువ్వన్న ఒంటిపీతిరిగద్ద లెక్కనే ఉంటాయి. దేశమంతోటంటె ఆల్లోటంటరు. గదాన్నే దేశభక్తంటరు.. గాల్ల దృష్టిల దేశమంటేందో ఎరికేనా...? చెట్లు గుట్టలు గుళ్ళు గోపురాలు.. మనుషులైతే అసలే కాదు... గందుకే గా మనుషులే వాళ్ళను చిత్తుగ ఓడించింద్రు...”

“గాల్ల గురించి వింటుంటె నీకు నవ్వెందు కత్తలేదని నేనంటున్న...”

“ఆల్లనేది ఈ శతాబ్దపు పెద్దజోకు... గాల్లు తెలంగాణ విమోచనదినం జరుపుతనంటుంటె నోటితోని గాదు ఇంకోదానితోని నవ్వల్ననిపిత్తంది. కనవి ఎప్పుడవడితప్పుడు రావుగద...! గందుకే ఊకున్న...” అన్నడు రాజవీరు.

“గంత జోకుందా అండ్ల మరి...!”

“జోకా...? జోకున్నరా...? ఆరేడేండ్ల వట్టి ఢిల్లీల, రాష్ట్రంల వాళ్ళూ, వాళ్ళ సోపతికాల్ల పార్టోల్లే అధికారంలున్నరు గద... గప్పుడు యాదికి రాని తెలంగాణ విమోచనం గిప్పుడు యాది కచ్చిందెందుకు..? గప్పుడు దాని మాటే ఎత్తనోల్లు గిప్పు డంటుంటె నవ్వురాదామరి... గిదంత రాజకీయమే.. అదేదో ఏలెటోల్లు చూసుకుంటరనుకుంటయి పాయెగద...!”

“ఆల్లు మా దండి దేశభక్తులయిరి... గట్లెందు కూకుంటరు...? ఇప్పుడాల్లకేం పన్లేదుగద...! గిదోటి ముందటేసుకున్నరు...”

“ఇంతకు తెలంగాణ విమోచన అంటేందట...? నీకు ఆ పార్టంటె మా దండి ప్రేమగద శర్మా! గదేందో చెప్పుతవా...?”

“గాయింత తెలువదనుకుంటున్నవా మావోల్లకు... నైజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందడం...” అన్నడు శర్మ..

“మనకు ససంత్రమెప్పుడచ్చింది..?”

“ఆగస్టు 15, 1947”

“మరి తెలంగాణకు ససంత్ర మెప్పుడచ్చింది...?”

“సెప్టెంబర్ 17, 1948 నాడు...” అంతకు ముందు నుంచి, గీ పదమూడు నెలలల్లేం జరిగింది తెలంగాణల...?

“రజాకార్లకు వ్యతిరేకంగ పోరాటం జరిగింది...”

“మీ పార్టోల్లు గింతే చెప్పుతరు... పూర్తి గా తెలిసినా ఒప్పుకోరు... గప్పుడు, ఆటెనుక కూడ సాయుధ పోరాటం జరిగింది... భూపోరాటాలు జరిగినయి... గండ్ల పాల్గొన్నోల్లెవ్వలో ఎరికేనా..? కమ్యూనిస్టులు.. మీవోల్లు వ్యతిరేకించెటోల్లు... దొరలు, భూస్వాములంతా నిజాం దిక్కే ఉన్నరు. పోరాటం చేసినోల్లను వ్యతిరేకించింద్రు... భూమి పంపకమయినా, తెలంగాణ విమోచనమయినా ఎవ్వలతోనయినట్టు...? కమ్యూనిస్టులతోనే కద...! మరిగప్పుడు తెలంగాణ గురించి అననోల్లు,, మొన్నటిదాక సీటు మీద గూసున్నప్పుడు మాట్లాడనోల్లు గియ్యాల్ల తెలంగాణ విమోచన గురించి మాట్లాడ్తాంటె దేనితోని నవ్వుతరు.... ?

“సర్దారు పటేలు చెయ్యబట్టయింది విముక్తి..?”

“పటేలు సైన్యానికి లొంగిండు నైజాం.. హైదరాబాద్ భారతదేశంల విలీనమయింది. అప్పట్రాక, అటెనుక నైజాం నెదిరించి, సైన్యాన్నెదిరించి భూములు పంచినోల్లెవ్వలు...? పోరాటంల చచ్చినోల్లెవరు...? మీ వోల్లక్కలన్నున్నరా...? గివన్ని మీ వోల్లకు తెలువయా.....?”

“కమ్యూనిస్టులు గూడ పోరాటం విరమించుకున్నరు గద...”

“అటెనుక.. ఆ సంగతులు వేరు.. ఆ రాజకీయాలు వేరు.. కని చరిత్రగిట్లుండె మీవోల్లు తెలంగాణ విమోచనని గిదీన్ని రాజకీయం జేసుడు సిగ్గనిపిత్తలేదా...? అనెటోల్లకు లేకున్నా వినెటోల్లకుండద్దా సిగ్గు...’

అంతల్నే రాజమల్లచ్చిండక్కడికి...

“ఏందే రాజమల్లన్న!... మొసపోసుకుంటత్తన్నవు...!! అన్నడు లక్ష్మి రాజం...

‘ఇయ్యాల్ల తెలంగాణ విమోచనో గదేందో కద...! గదాన్ని గవర్నమెంటే జోరుదారుగా చెయ్యన్నని ఇంతకుముందు అధికారంలునోల్లు, కమలం పార్టోల్లు లొల్లిలొల్లి జేత్తంద్రు... గీ సంగతి గిప్పుడు యాదికచ్చిందా మీకని పోలీసోల్లు ఉరికిచ్చురికిచ్చి కొడ్తంద్రు... లాఠీల్జూసి ఎక్కడోల్లక్కడురుకమచ్చుకుంటంద్రు.... గాలికి పొయ్యే కంటను తలిగిచ్చుకునుడెందుకని నేను తప్పించ్చుకోనచ్చిన...” అన్నాడు రాజమల్లు...

“వాళ్ళంత గోసులు సదురుకుంటురుకు తంద్రంటవా...?”

“గిప్పుడు గోసులెక్కడియి...? అన్ని పయింట్లేనాయె... ఉసిపోతున్న పయింట్లు మీదకనుకుంట ఉరుకింద్రు.. ఉరుకుడయి పోయింది...”

“మరి గాల్లు గిట్లెందుకు చేసింద్రంటవు...?”

“అధికారం లేకపాయె... పన్లేకపాయె... గిట్లనన్నజేసి ప్రజల సానుభూతి పొందుదామని... గంతకంటేముంది...?”

“గిట్లజేత్తె ఓట్లత్తయా మరి...?”

“ఆల్లు జేసేటియే గిసోంటి పనులాయె... ప్రజల అవసరాలను, ఆకలిని తీర్చే ఒక్క పనిగూడ చెయ్యకపోయిరి... దేవుళ్ళ పేరుమీద, మతాల పేరుమీద గుళ్ళ పేరు మీద రెచ్చగొడితే ఎన్నేండ్లు నడుత్తది...? జెనం తెలివికచ్చింద్రుగద... అందుకే మాకు కావాల్సినయి గవ్వికాదు... రోటీ కపడే ఔర్ మకాన్ అని వాళ్ళను దూరం పొమ్మన్నరు.. అయినా ఆల్లు మారలేదు... మారరు గూడ...”

“మరి తెలంగాణ విమోచన మయిందంటవా...?”

“నైజాం నుంచి ఎప్పుడో అయింది నిజమేకని దొరల నుంచి కాలేదు గద...! గందుకే మల్ల మల్ల పోరాటాలచ్చె... భూముల్ని ముడ్డికింద పెట్టుకొని ‘దున్నగలిగే వానికే భూమి’ అని ఇంకేదో అనే అసోంటోల్ల నుంచి విముక్తి పొందినప్పుడే నిజమైన విముక్తి పొందినట్టు....”

రాజమల్లు మాటలల్ల అగ్గసోంటి నిజాలుండుడు గమనించింద్రందరు. ✣

డా॥ బి.వి.శ్రీనివాసరావు, ఎం.డి.





బ్లడ్‌ప్రెజర్ సెల్ఫ్‌మోనిటరింగ్

హై బ్లడ్ ప్రెజర్! ఈ పదం ఇప్పుడు చాలా మందిని కలవరపెడుతోంది. వయస్సు మూడు పదులు కూడా నిండక ముందే బి.పి. బారిన పడుతోన్న యువత సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇందుకు కారణాలు అనేకం. వంశపారంపర్యత, వ్యాయామలేమి, ఆహారపు అలవాట్లు, వృత్తిపర, జీవన మానసిక ఒత్తిడులు, ఆందోళనలు మొదలైనవి ప్రధాన కారణాలుగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. హైబ్లడ్ ప్రెజర్ వల్ల రక్తనాళాలలో మార్పులు వస్తాయి. ఈ మార్పులు రక్తపోటుపై ప్రభావం చూపుతాయి. హృదయంలోనూ అసాధారణతలు చోటు చేసుకుంటాయి. మూత్ర పిండాలు దెబ్బతింటాయి. నేత్ర సంబంధ సమస్యలు తలెత్తుతాయి. నిర్లక్ష్యం చేస్తే అంధత్వానికి దారి తీస్తాయి. పక్షవాతానికి గురికావచ్చు. హార్ట్ఎటాక్‌కు దారితీయవచ్చు. దేహంలో హైబ్లడ్ ప్రెజర్ వున్నా లక్షణాలు కనిపించాలని ఏమీ లేదు. ఎలాంటి లక్షణాలు బయటపడకుండానే హై బి.పి. ఉండ



వచ్చును. సమస్య (కాంప్లికేషన్)లు బయటపడి వైద్యుని సంప్రదించి నప్పుడు హై బి.పి.ని గుర్తించడం నేడు చాలా మందిలో జరుగుతోంది.

ప్రతి ఒక్కరిలో బ్లడ్ ప్రెజర్ వుంటుంది. ఇది సాధారణంగా 120/80 మెర్క్యురీ మిల్లీ మీటర్లుగా వుంటుంది. వయస్సును బట్టి కొద్దిపాటి తేడాలు ఉండవచ్చును. ఇది అసాధారణ స్థాయికి పెరిగిపోవడాన్నే హైబ్లడ్ ప్రెజర్ (అధిక రక్తపోటు)గా పేర్కొంటారు. దీనినే వైద్యశాస్త్ర పరిభాషలో 'హైపర్ టెన్షన్' అని అంటారు.

వైద్యులు - వచ్చిన రోగికి తొలుత బి.పి. చూడడం జరుగుతుంది. ఇందుకు సాధారణంగా స్ఫిగ్మోమానోమీటర్ ఉపయోగిస్తారు. ఈ విషయం అందరికీ తెలిసిందే. ఈ పరికరంతో వైద్యులు లేదా వైద్య సిబ్బంది మాత్రమే బ్లడ్ ప్రెజర్‌ను రికార్డు చేయగలరు. బ్లడ్ ప్రెజర్‌ను రికార్డు చేసుకోవడానికి తప్పనిసరిగా వైద్యుని దగ్గరకు వెళ్ళవలసి వస్తుంది. అయితే ఈ దశాబ్దంలో ఇంటిలోనే బ్లడ్ ప్రెజర్‌ను రికార్డు చేసుకునే పరికరాలు రూపొందించబడ్డాయి. వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది అవసరం లేకుండానే స్వయంగా బ్లడ్ ప్రెజర్‌ను రికార్డు చేసుకొనే అవకాశం వీటి వల్ల ఏర్పడింది. వీటినే "హోమ్ బి.పి. మోనిటరింగ్ డివైసెస్"గా పేర్కొంటున్నారు. ఇందులో రెండు రకాలున్నాయి.

1) ఎనెరోయిడ్ బి.పి.మానిటర్
2) డిజిటల్ బి.పి.మానిటర్



ఎనెరోయిడ్ బి.పి.మానిటర్

ఎనెరోయిడ్ బి.పి. మానిటర్ ద్వారా బి.పి. రికార్డు చేయడానికి స్టెతస్కోప్ అవసరమవుతుంది. తొలుత బి.పి. మోనిటర్ కఫ్‌ను చేతికి కట్టాలి. స్టెతస్కోపు ఇయర్‌పీస్‌లను చెవిలో పెట్టుకుని మోచేతి దగ్గర లోపలివైపు స్టెతస్కోప్ పెట్టాలి. కఫ్‌ను ఇన్‌ఫ్లేట్ చేయాలి. కఫ్‌ను ఇన్‌ఫ్లేట్ చేసేటప్పుడు స్పీడ్‌గా చేయాలి. నిదానంగా చేయకూడదు. అలా చేస్తే రీడింగ్‌లో లోపాలు వచ్చే అవకాశాలుంటాయి. తర్వాత కఫ్‌వాల్వ్‌ను నెమ్మదిగా లూజ్ చేస్తూ ఉండాలి. స్టెత్‌తో వింటూ ఉంటే హృదయస్పందన శబ్దం వినబడుతుంది. తొలుత శబ్దం వినబడే రీడింగునే సిస్టోలిక్ ప్రెజర్‌గా పేర్కొంటారు. ఇంకా కఫ్‌ను లూజ్ చేస్తూ వుంటే ఒక దశలో శబ్దం పూర్తిగా ఆగిపోతుంది. దాన్నే డయాస్టోలిక్ ప్రెజర్‌గా పేర్కొంటారు.

డిజిటల్ బి.పి.మోనిటర్

డిజిటల్ బి.పి. మోనిటర్‌లతో బి.పి. రికార్డు చేయడం చాలా సులభం. అయితే ఈ పరికరం అత్యంత సున్నితమైనది. స్వల్ప లోపాలకు కూడా బి.పి. రికార్డులో తేడాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా వుంటాయి.

తొలుత కఫ్‌ను ముంజేతి చుట్టూ కట్టాలి. పవర్‌ను ఆన్ చేయాలి. ఇందులో మరల రెండు రకాలున్నాయి. ఎ) ఆటోమేటిక్, బి) సెమి ఆటోమేటిక్

ఆటోమేటిక్ డిజిటల్ మానిటర్‌లో కఫ్ దానంతట అదే ఇన్‌ఫ్లేట్ అవుతుంది. సెమి ఆటోమేటిక్ మోనిటర్‌లో కఫ్‌ను ఇన్‌ఫ్లేట్ చేయాల్సి వుంటుంది.

కఫ్‌ను ఇన్‌ఫ్లేట్ చేసిన తర్వాత ఆటోమేటిక్ మెకానిజమ్ వల్ల దానంతట అదే కఫ్‌ప్లెజర్ తగ్గుతుంది. బి.పి.రీడింగ్ డిస్‌ప్లే విండోలో కనబడుతుంది. మళ్ళీ రిపీట్ చేయాలనుకుంటే 2-5 నిమిషాల తర్వాత చేసుకోవాలి.



వీటిలో ముఖ్యంగా చేతికి సరిపోయే కఫ్‌ను ఎంచుకోవాల్సి వుంటుంది. ఈ విషయంలో వైద్యుని, వైద్య సిబ్బంది సలహా తీసుకోవడం మంచిది. కఫ్ సైజు చేతి సైజులో తేడాలుంటే బి.పి.రీడింగ్‌లో తేడాలుండవచ్చు.

ప్రయోజనాలు :

ఇవి ఆటోమేటిక్‌గా పనిచేస్తాయి. పోర్టబుల్ కనుక ఎక్కడికైనా వెంట తీసుకువెళ్ళవచ్చు. బి.పి. డిస్‌ప్లే అవుతుంది కనుక మోనిటర్ చేయడం అత్యంత సులభం. కొన్ని మోడల్స్ పేపర్‌పై బి.పి.ని ప్రింటు



చేసి ఇస్తాయి. అయితే కొద్దిపాటి తేడాలకు అవకాశాలు ఎక్కువగా వుంటాయి. కరెక్ట్ పద్ధతిలో వీటిని వాడితే యాక్యురసి (కచ్చితమైన) రీడింగ్ వస్తుంది. శరీర కదలికలు, గుండె కొట్టుకునే వేగం మొదలయినవి బి.పి. రీడింగ్‌పై ప్రభావం చూపుతాయి. ఇవి బ్యాటరీల ఆధారంగా పని చేస్తాయి. ఖరీదైనవి. బి.పి. మోనిటరింగ్‌కు ప్రతిసారి వైద్యుని దగ్గరకు వెళ్ళకుండా ఇవి ఉపయోగపడతాయి.

బ్లడ్‌ప్రెజర్‌ను రికార్డు చేయబోయేముందు

❋ 5-10 నిమిషాలు పూర్తి విశ్రాంతిలో వుండాలి. మాట్లాడకూడదు.

❋ స్థిమితంగా, స్థిరంగా కూర్చోవాలి. కాలుపై కాలువేసుకుని కూర్చోకూడదు.

❋ చేతులలోఏవీ పట్టుకుని ఉండకూడదు. ఫ్రీగా వుండాలి.

❋ చేతిని గుండె లెవల్‌లో పెట్టాలి. ఏదైనా బల్లపై చేతిని పెడితే లెవెల్ సరిపోతుంది.

❋ చేతికి సరిపోయే కఫ్‌ను ఎంచుకోవాలి. ఇంతకుముందే చెప్పినట్లు సరైన సైజుకఫ్ లేకపోతే బి.పి. రీడింగ్‌లో తేడాలొస్తాయి.

❋ చేతిలో సరైన ప్లేస్‌లో కఫ్ కట్టాలి. చొక్కాలపై నుండి కఫ్ కట్టకూడదు.

❋ అప్పుడప్పుడు బి.పి. మోనిటర్ పనితీరును తెలుసుకుంటూ వుండాలి. రాంగ్ రీడింగ్‌లు వస్తుంటే వెంటనే గుర్తించి నిరోధించాలి. కనీసం సంవత్సరానికి ఒకసారి అయినా పరికరాన్ని తయారు చేసే కంపెనీల రిప్రజెంటేటివ్‌ల ద్వారా వైద్యులు పరీక్షింప చేయాలి. ఈ పరికరాలతో సక్రమ పద్ధతిలో బి.పి.రీడింగ్ చేయడం నేర్చుకోవడం ద్వారా ప్రతిరోజూ బి.పి. చెకింగ్ కొరకు వైద్యుని దగ్గరకు వెళ్ళకుండా దోహదపడుతుంది. మందులు వాడుతున్నప్పుడు అవి ఎంతవరకు పని చేస్తున్నాయో మోనిటర్ చేయడంలో ఈ పరికరాలు ఎంతగానో దోహదపడతాయి. అయితే వీటి ఖరీదు మాత్రం అందరికీ అందుబాటులో లేదు. ఈ విషయమై మేధావులు, సంబంధిత అధికారులు ఆలోచించాలి. ఆధునికశాస్త్ర, సాంకేతిక ఫలాలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలి.

(హెల్త్‌హెల్ప్ సౌజన్యంతో)

అలరించే "చందూ"

రోజూ ఇంట్లో పెంకి పనులు చేస్తూ అమ్మానాన్నలను, ఇతరులను ఇబ్బందిపెట్టే పిల్లలు ప్రతి ఇంట్లో వుంటారు. మనం కూడా ఇలాగే చేసి వుండి వుంటాం. సాధారణంగా పిల్లలు చేసే పనులు వాళ్ళకి ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. వాళ్లకు ఇష్టంలేని పనిచేస్తే ఇంటి పైకప్పు ఎగిరిపోయేలా గోల చేస్తారు. 'ఒరేయ్ అది తప్పురా అలా చేయకూడదు' అని అంటే సాధ్యమైనంత వరకు అదే చేయాలని చూస్తుంటారు. పిల్లలు చేసే పనులకు ఒక్కోసారి పెద్దలకు సంజాయిషీ చెప్పుకోవలసి వస్తుంది. పిల్లలు పెంకి పనులు చేస్తుంటే తల్లిదండ్రులకు భయమేస్తూ ఎక్కడ తలనొప్పి తీసుకొస్తాడోననిపిస్తుంది. వాళ్ల మాటలు కూడా ఒకపట్టున అర్థం కావు. వాటిని అర్థంచేసుకోవాలంటే చాలా కష్టపడాల్సివుంటుంది. పేర్లు సాగదీసి చెప్పడం, పేరులో కొంత బాగాన్నే చెప్పడం, పేరుకుముందు వాళ్లు అనుకున్న పేరు తగిలించి పిలవడం చేస్తుంటారు. పిల్లలు చేసే పనులు తాతయ్యలకు, బామ్మలకు ఎంతో ఆనందాన్ని ఇస్తూంటాయి. రోజంతా ఎంతో కష్టపడి వచ్చి పిల్లలతో కాసేపు ఆడితే ఎంతో హాయిగా వుంటుంది. జీవితంలో ప్రతి మనిషికి మధురంగా, సంతోషంగా తోచేది చిన్ననాటి ఆ తీపిగుర్తులే. మళ్లీ అలాంటి జీవితం వస్తే బాగుండు అనిపిస్తూ వుంటుంది. బాలిగారు గీసిన చందును చూస్తే మరోసారి బాల్యంలోకి వెళ్ళి వచ్చారనే అనిపిస్తుంది. మనవడు చేసిన పనులకు తాత తనదైన రీతిలో బొమ్మలుగీసి, డైలాగ్స్ రాసి ఎంతోమంది పిల్లలనే కాకుండా పెద్దలను కూడా ఆకర్షించారు. చందు వేసే కొంటె ప్రశ్నలు బాగా నవ్విస్తాయి. "మీ స్కూల్లో నీ మాతృభాష ఏమిటీ అని అడిగితే తెలుగు అని చెప్పాలి" అని అంటే "మరి పితృభాష ఇంగ్లీషు అని చెప్పనా..." అని అమాయకంగా అడుగుతాడు. చందు చెప్పే సమాధానం ఎంతగానో ఆలోచింపచేస్తూనే నవ్విస్తుంది. "మా ఫ్రెండ్ పవన్‌గాడు లేడు...వాడు లెక్కల్లో పూర్..టీచర్ బాగా తిట్టింది." "మరి నువ్వు బాగా చేశావా?" "ఉహు ఇంకెప్పుడూ వాడిదాన్లో చూసి రాయకూడదనుకున్నా" అని అసలు విషయం చెప్పే చందూ మొహం మాత్రం అమాయకంగా ఉంటుంది. మరో కార్టూన్‌లో "ఎందుకురా! అంత కోపంగా ఉన్నావ్..... నేను ఏమన్నాననీ?" "కోపంగా ఉంటే ఎలా వుంటానో అని"...అద్దం చూసుకుంటూ అనడం చూస్తే హారి గడుగ్గాయి అనిపిస్తుంది. "అరే చందూ నీదగ్గర నాలుగు చాక్లెట్లు ఉన్నాయనుకో...సుబ్బరమణియంకి ఒకటీ, నాకు రెండూ ఇస్తే నీదగ్గర ఇంకా ఎన్నిమిగిలి ఉంటాయి?" అనడిగే మరో కార్టూన్‌లోని చందూ "నాలుగూ" అంటాడు. "అదెలా..!" అని తిరిగడిగితే, "నాకు చాక్లెట్లు అంటే ఇష్టం. ఎవరికీ ఇవ్వనుగా" అనడం చూస్తే హారి వీడి తెలివి బంగారంగానూ అని ముద్దుగా అనాలనిపిస్తుందెవరికైనా. ఇంకో కార్టూన్‌లోని కుక్క తోక పట్టుకున్న చందూ చిలిపి అల్లరి చూద్దాం. "కుక్క తోక లాగకురా...లాగొద్దని చెప్పానా!" అని వాళ్ళమ్మ అంటుంటే, "లేదే! సరదాగా చూద్దామని తోక పట్టుకున్నానా...అదే లాక్కొంటోంది తెల్సా!" అన్న చందూని వాళ్ళమ్మ ఇంకేం చేస్తుంది...ఒక ముద్దు పెట్టేస్తుంది. పిల్లలే కదా అని కొంతమంది పెద్దలు వాళ్ళముందే కొన్ని మాటలు అనేస్తుంటారు. కానీ పిల్లలు ఆ మాటల్ని తమ ఊహకు అందిన అర్థాలలోకి అనువదించేసుకుంటారని బాలీగారు ఈ కార్టూన్ భలే వేశారు. "అమ్మోయ్! అమ్మా రామారావు అంకుల్ ఆఫీసునుండి వస్తూ ఆంటీని మై స్వీట్ అని అన్నాడే" "ఏదో సరదాగా అన్నాడు కాబోలు అంతేకదా!" "అదేంకాదులే మొన్న పండక్కి బోల్డు స్వీట్లు చేసిందిగా అందుకేనేమో...." అని చందూ లాంటి పిల్లలంటే ముసిముసిగా నవ్వుకోడం మినహా ఏం చేస్తాం. "పుస్తకంలో నిజము పలుకుము అని ఉందిరా! మొన్న అలాగే పలికేనా మా అమ్మ చెవినులిమింది" అని తన స్నేహితుడితో చందూ ఈ కార్టూన్‌లో అంటున్నాడు. "ఏం చేశావు!" అనడిగాడు చందూ నేస్తం. "బస్‌కి చిల్లర డబ్బులు లేవని మా నాన్న గొణుక్కుంటుంటే వంటింట్లో పోపుల డబ్బా వెతకమన్నాను" అన్నాడు.

చందు
రచన : బాలి;
వెల : రు.90/-;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు;
286 పేజీల కార్టూన్లు



"ఇవాళ హిస్టరీ పరీక్ష అయినట్టుంది. బాగా రాశారా?"/"ఏదోరాసాం...హిస్టరీ అంటేనే మాకు తలనొప్పి. ఎప్పుడో మేం పుట్టకముందు జరిగినవి అడిగితే ఏంచెప్తాం".

"అరే చందూ మరేమో... మా బాబాయి కారు కొన్నాడురోయ్"/"ఏ కంపెనీదిరా!"/"అదే కంపెనీదో గుర్తు లేదుగానీ...'టీ' తో స్టార్టవుతుందిరా!"/ "బడాయి. ఎక్కడన్నా కారు 'టీ' తో స్టార్టవుతుందా! పెట్రోలుతో స్టార్టవుతుందిగానీ!"

''ఎందుకురా ఏడుస్తున్నావ్!''/ "సుబ్బరమణియంగాడు కొట్టాడు."/ "కొట్టుకోవడం కల్సుకోవడం ఒకర్ని విడిచి ఒకరు ఉండలేరాయే! నువ్వు తిరిగి కొట్టకపోయావా!"/ "కొట్టేవాడినే నన్ను తిరిగి కొట్టే ఛాన్స్ వాడికొస్తుంది కదాఅని".

"మీ అమ్మ ఎందుకురా ఏడుస్తుంది"/"కొత్త బట్టలు కొనలేదని..."/ "మీముఖం... ఉల్లిపాయలు తరుగుతున్నానా!"

" ఇవాళ మా క్లాసులో ఓ అబ్బాయి బల్ల మీదనుంచి కింద పడితే అందరూ గొల్లున నవ్వారు. నేను మాత్రం నవ్వలేదు"/ "అలా నవ్వడం తప్పు"/ "అవును అందుకే నాకు ఏడుపొచ్చింది."/ "ఇంతకీ ఆ పడిన బాబు ఎవర్రా!"/ "నేనే!"

ఇలా కొంటె ప్రశ్నలతో, సుతిమెత్తగా నవ్వించే సమాధానాలతో, అతితెలివితేటలనిపించేలా, ఆరిందలా, అమాయకపు ప్రశ్నలతో పెద్దవాళ్ళు ఉలికిపడేలా ఈ కార్టూన్ల ద్వారా చందూ అందరినీ ఆకర్షిస్తాడు. రేపు ఏం చేస్తాడోనని ముందుగానే అడగడం అంటే చందు చేసే పెంకి పనులు ఎంత ముద్దుగా ఉంటాయో ఇట్టే అర్థమౌతుంది. ఆంధ్రప్రభ పత్రిక పిల్లల కోసం 'చిన్నారి' అనే టైటిల్‌తో చిన్న పుస్తకం అందించారు. అందులో నాలుగు పేజీలు ఈ చందూ కార్టూన్‌స్టోరీకి కేటాయించారు. వారం వారం 'చందు' దాదాపు నాలుగు సంవత్సరాలపైనే కనపడ్డాడు. తన మనవణ్ణే కారెక్టర్‌గా మలచడంలో బాలి గారు బాగా సక్సెస్ అయ్యారు. తాతా-మనవళ్ళ ఆ మధురానుబంధం ఇలా బుక్ రూపంలో తీసుకురావడం చాలా సంతోషించదగ్గ విషయం. ఇందులో నవ్వించేవి కొన్ని, అందర్నీ అలరించేవి అన్నీ అని చెప్పొచ్చు.

- జె.వెంకటేష్



జగన్మోహన్ ప్యాలెస్



ప్యాలెస్‌లో కళ్యాణ మంటపం

దసరా ఉత్సవాల

మైసూర్ ప్యాలెస్

రాకెట్ల వీరన్న

మాములు రోజుల మైసూరుకీ, దసరా ఉత్సవాల మైసూరుకీ చాలా తేడా ఉంది. దసరా రోజులలో మైసూర్ వెళ్ళడం ఒక పండుగ అనుభూతిని కలిగిస్తుంది.

మైసూర్ అనగానే మైసూర్ ప్యాలెస్, రాజుల పాలన, రాజ ప్రాసాదాలు, రాజుల విలాసాల భవనం గుర్తుకు వస్తుంది. కానీ మైసూర్ ప్యాలెస్ అంటే కేవలం రాజుల విలాసభవనం మాత్రమే కాదు. అది ఎంతో మంది కళాకారుల, చిత్రకారుల, సంగీత విద్వాంసుల, యుద్ధ వీరుల, మల్లువీరుల, ఇంజనీర్ల, వడ్డెర్ల మేధస్సుకు, నైపుణ్యానికి ఓ మచ్చుతునక అని చెప్పవచ్చు. ఆ సుందర భవనంలో ఎంతో మంది చిత్రకారులు వేసిన చిత్రాలు, ఎంతో మేధస్సుతో ప్లాన్‌ను రూపొందించి కట్టిన ఇంజనీర్ల ప్రతిభా పాటవాలు, ఎంతో మంది యుద్ధవీరుల త్యాగం, ఎంతో మంది సంగీత విద్వాంసుల నాట్య, గానా మృతాలు అందులో నిబిడీకృతమై ఉన్నాయి. భారతదేశంలో ఎన్నో రాజ సంస్థానాలు గతంలో ఉన్నాయి. ఎన్నో ప్యాలెస్‌లు నిర్మించారు. కానీ ఇంత అంద మైన, అద్భుతమైన, ఆకర్షణీయమైన, ఆశ్చర్యాన్ని గొలిపేది మరొకటి భారత దేశంలో ఉండదంటే అతిశయోక్తి కాదు. దేశ, విదేశీ పర్యాటకులను నిత్యం ఆకర్షించే ఈ ప్యాలెస్‌ని చూడాలే గాని చెప్పనలవి కాదు.

మైసూరు రాజ్యాన్ని ఎందరో మహారాజ వంశీయులు పాలించారు. క్రీ.శ.1399లో మొట్టమొదట మైసూర్ రాజ్యాన్ని రాజా మధురాయ్ ఏర్పాటు చేశారు. మొత్తం 24మంది రాజులు ఈ రాజ్యాన్ని పాలించారు. 1761-1799లో హైదర్‌ఆలీ, అతని కుమారుడు టిప్పు సుల్తాన్ శ్రీరంగపట్నాన్ని బ్రిటిష్‌వారి నుండి వశపరచుకుని పాలించారు.

న్యూ పాలెస్ :

మహారాణి కొత్త ప్యాలెస్ నిర్మించాలని తలచింది. కొత్త తరహాలో ఎక్కడా లేని విధంగా దీన్ని నిర్మించాలని తలచింది. దీనికి ఆర్కిటెక్చర్ ప్లాన్స్ తయారు చేసింది 'హెన్రీ ఇర్విన్'. ఈయన కలకత్తా, ఢిల్లీ, ఆగ్రాల్లో ఉన్న కొత్త తరహా బిల్డింగుల రూపకల్పనను స్టడీ చేసి వచ్చి దీని నిర్మాణానికి పూనుకున్నారు. ఈ ప్యాలెస్‌లో 'జగన్‌మోహన్ ప్యాలెస్' అత్యద్భుతం. 1908లో బ్రిటిష్ ఎగ్జిబిషన్‌లో అత్యుత్తమ కట్టడంగా ఇది అవార్డు పొందింది. 1912లో ఈ కట్టడం నిర్మాణం పూర్తయింది. దీనికి రూ.41,47,913 ఖర్చయింది. హోయసాలుల నిర్మాణశైలిలో ఉన్న ఈ రాజభవనం భారతదేశంలోనే అందమైన అద్భుత కట్టడాలలో ఒకటి.

ఈ రాజభవనంలో చాలా చోట్ల యూరోపియన్ పెయింటర్ల చేత పెయింట్ వేయించారు. ప్యాలెస్‌లోని పడమర భాగం మహిళల కోసం కేటాయించారు. వెస్ట్రన్ తరహాలో కట్టిన మొత్తం భాగాన్ని మహారాణుల కోసం కేటాయించారు. ఉత్తర భాగాన్ని ఆర్మీ, గ్రంథాలయం, తదితర ఆఫీసుల కోసం కేటాయించారు. వీటన్నింటిలో అంబవిలాస్ చెప్పుకోదగిన భవనం. అంబవిలాస్‌లో పది అడుగుల ఎత్తులో ఉన్న సీలింగ్ యూరోపియన్ తరహాలో అలంకరించ బడింది. ఈ గదికి దంతం, వెండి డోర్లు అద్భుతంగా డిజైన్ చేశారు. డైనింగ్ హాల్, స్లీపింగ్‌బెడ్స్ ఈ రూములోనే ఉన్నాయి.

కళ్యాణమంటపం :

ప్యాలెస్‌లోని దక్షిణ భాగంలో పెవిలియన్ కళ్యాణ మంటపం ఉంది. ఈ గ్రేట్ దర్బార్‌హాల్ 155 అడుగుల పొడవు, 42 అడుగుల వెడల్పుతో ఉంది. కనులు మిరుమిట్లు గొలిపే అద్దాల సెట్టింగ్స్, అడుగు ముందుకు వేయలేని అందమైన పెయింటింగ్స్‌ని మైసూరు ఆర్టిస్టుల చేత వేయించారు. మూడు శక్తివంతమైన స్తంభాలను రౌండ్‌గా డిజైన్ చేసి, దానిలోకి వెలుతురు రావడానికి స్టెయిన్డ్ గ్లాస్‌తో నెమలి ఆకారంలో డిజైన్ చేసిన ఈ భవనం అద్భుతం. అందుకే దీనిని పీకాక్ పెవిలియన్ అంటారు. ఈ కళ్యాణ మంటపంలోని గోడలకు మైసూర్ దసరా ఉత్సవాలు ఎంత అద్భుతంగా జరుగుతాయో తెలిపే చిత్రాలను పెయింటింగ్స్ వేశారు. ఆ చిత్రాలు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించే స్థాయి. ఇక్కడ 26 ప్యానళ్లలో పెయింట్స్ ఉన్నాయి. ఈ అద్భుత మందిరంలో ప్రఖ్యాత చిత్రకారుడు రవివర్మ వేసిన అద్భుత చిత్రాలు ఈ గోడలపై తారసపడతాయి.

మైసూర్ ప్యాలెస్

14వ శతాబ్దంలో ఈ ప్యాలెస్‌లో మహారాజులు నివశించారు. 1638లో రణధీర కంఠీరవ నరసరాజ వడియార్ ఆ ప్యాలెస్‌ను పునర్నిర్మాణం చేశారు. 1760లో క్రిష్ణరాజ వడియార్-2 తన రాజధాని మైసూర్‌ను, ప్యాలెస్‌ను తిలకించడానికి అప్పటి ప్రధాని 'హైదర్ ఆలీ'ని ఆహ్వానించారు. 19వ శతాబ్దాంతంలో నాలుగు దిక్కులా అందమైన ద్వారాలు నిర్మించారు. నగర నడిబొడ్డున నలుదిక్కులా గంభీరంగా ఈ ద్వారాలు కనిపిస్తాయి.

దర్బార్ హాల్

ఇక్కడి నుంచి రాజ భవనం ముందు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను మల్లు యుద్ధం, కత్తి యుద్ధం తదితర పోటీలను తిలకించేవారు. ఇప్పుడు దసరా సమయంలో ఏర్పాటు చేసే సంగీత కార్యక్రమాలను ఇక్కడి నుంచి పర్యాటకులు చూడవచ్చు. కర్నాటక ప్రభుత్వం దసరా సందర్భంగా జాతీయ సంగీత విద్వాంసులను పిలిపించి కచేరి నడిపిస్తుంది. అంతేకాక ఈ గ్యాలరీలో రవివర్మ వేసిన నాలుగు తరాల మైసూర్ రాజుల చిత్రాలను కూడా చూడవచ్చు. నిజంగా ఈ దర్బార్‌హాల్ దర్పంగా, హుందాగా ఉంటుంది.



డాల్స్ పెవిలియన్

దసరా పండుగ సందర్భంగా డాల్స్ ప్రదర్శన ఘనంగా జరుపుతారు. అంటే దసరా సందర్భంగా బొమ్మలను పూజించడం ఇక్కడ ఆనవాయితీ. ఈ సంప్రదాయం విజయనగర రాజుల కాలం నుండి ఆనవాయితీగా వచ్చింది. ప్రతి ఇంటిలోనూ బొమ్మలను చాలా అందంగా ఏర్పాటు చేస్తారు. అది ఈ నాటి వరకు జరుగుతూనే ఉంది. ప్యాలెస్‌లోని వెస్ట్రన్‌పార్ట్‌ని ఈ గొంబితొట్టి (బొమ్మల ప్రదర్శన) కోసం కేటాయిస్తారు. ఇక్కడ రకరకాల బొమ్మలు, యూరోపియన్ శిల్పాలు చేసిన చలువరాతి బొమ్మలు కూడా ఇక్కడ ఉంచుతారు. ప్రతి ఒక్కరూ వీటిని ఉచితంగా సందర్శించవచ్చు. దీనిని 1897 నుండి కొనసాగిస్తున్నారు. రక్షణగేట్ నుండి సందర్శకులు లోనికి వెళ్లాల్సి ఉంటుంది. దక్షిణ, ఉత్తర భాగాల గొంబితొట్టిని విడగొట్టి కోర్టుయార్డుగా ఏర్పాటు చేశారు. దీనిని రెండుగేట్లు ఏర్పాటు చేశారు. వీటిని ఆనెబాగిలు (జంతువుల గేట్లు) అని పిలుస్తారు.

ప్యాలెస్‌లోని ఉత్తరభాగంలో మరో భాగాన్ని గోల్డెన్ హౌదా అని కూడా పిలుస్తారు. వుడెన్ స్ట్రక్చర్‌తో ఉన్న ఈ మంటపాన్ని బంగారు పూత ఉన్న షీట్లతో డిజైన్ చేశారు. ఈ భాగాన్ని ఉత్సవాల ఆఖరి రోజున తెరుస్తారు. ఆరోజు ఏనుగును బాగా అలంకరించి పూజిస్తారు. దాదాపు 80 కిలోల బంగారు ఆభరణాలను ఏనుగుపై చాముండేశ్వరీ దేవికి తీసుకెళతారు. ఇక్కడకొచ్చిన పర్యాటకులకు ఒక పక్క దసరా పండుగ, మరోపక్క ఓ అందమైన పర్యాటక స్థలంలో ఉన్నామనే మధురానుభూతి జీవితాంతం మిగిలిపోతుంది. ❖



అతని నోరు వాయిద్యాల గని...!

పిడుగు సుబ్బరాయుడు



బా గా ఎండగాస్తోంది. అత్యవసర పనిమీద నేనూ నా మిత్రుడు శివప్రసాదు కలెక్టరును కలవాల్సి వచ్చింది. అది ఆ రోజే చేయాల్సిన పనిగాబట్టి వెంటనే బయలు దేరాం. కలెక్టరేట్‌కు చేరుకున్నాం. అప్పటికే కలెక్టర్ బ్యాంకర్ల మీటింగులో కూర్చొని ఉన్నారు. మేమెళ్ళిన పని కలెక్టరుతో విడిగా మాట్లాడేది కాబట్టి ఆయన తన ఛాంబర్లోకొచ్చేదాకా ఆగక తప్పలేదు. ఏంచేయాలబ్బా అనుకుంటూ కలెక్టర్ సిసి వద్దకు వచ్చి పరిచయం చేసుకుని కూర్చున్నాం. అంతలోనే చేతిలో ప్రజాశక్తి సండేబుక్‌లో అర్జీ పెట్టుకుని కలెక్టరుకివ్వాలంటూ అనామకుడిలా సిసి వద్దకొచ్చాడో వ్యక్తి. నన్ను గుర్తుపట్టి నమస్కారం చేశాడు. అతనెవరోకాదు మంచి భావాలుట్టిపడే కవితలు రాయగల స్వరూప్ కుమార్ అతన్ని సిసికి పరిచయం చేసి పంపించాము. తరువాత మొదలైంది అసలైన కథ. అక్కడే గల మరొక వ్యక్తి కళలకు ఆదరణేదుందండీ అంటూ మొదలెట్టాడు. వెంటనే నేను "ఏవండీ మీరు కళాకారులా?" అంటూ అందుకున్నాను. "అవునండీ నాకు 20 సంవత్సరాల మిమిక్రీ అనుభవం ఉంది. అవకాశమిస్తే ప్రముఖ మిమిక్రిస్ట్ హరికిషన్‌ను మెప్పించగలనండీ" అన్నాడు. అవునా! మీరు చూస్తే అలా కనిపించరు కదండీ అన్నాను. వెంటనే తాను పాతరోజుల్లోకి వెళ్ళిపోయారు. "**తాళికట్టు శుభవేళ మెడలో కళ్యాణ మాల**" అనే పాటను పాడుతూ అదే మ్యూజిక్‌ను నోటితో చేసి చూపించారు. అంతటిదాకా అనుకోలేదు మేము ఆయన అంతటి కళాకారుడని! నిజంగా ఆ సమయంలో మంచి సౌండ్ సిస్టం ఉండి ఉంటే మీటింగులో ఉన్న కలెక్టరుతో సహా అధికారులందరూ అక్కడికి పరుగెత్తుకొచ్చే వారేమోననిపించింది. డోలు, సన్నాయి వాయిద్యాలెలా

ఇదా.... నీ జాడ?



తెలుగువాడా? ఏది నీ వాడ?
అమెరికాలో నీ కొడుకుండాల
ఆస్ట్రేలియాలో నీ కూతురు చదవాల
లండన్‌లో నీకో ఇల్లుండాల
కౌలాలంపూర్‌లో నీకో హోటలుండాల
జర్మనీలో చదువుకోసం నీ మనుమడుండాల
దానికోసం గవర్నమెంటు స్కాలర్‌షిప్పుండాల
చైనాతో నీకు వ్యాపారాలుండాల
సౌదీ అరేబియాతో కంట్రాక్టులు కావాల
బెంగాల్లో నీకో మందుల కంపెనీ కావాల
బీహార్లో నీకో మంచి గేదెల ఫారముండాల
మద్రాసులో మరినీకో ఐ.టి. కంపెనీ నడవాల
ఢిల్లీ పార్లమెంటులో నీకు పార్లమెంటు సీటుండాల
గుజరాతులో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ స్టాంపుల
స్కాం నడవాల
బొంబాయిలో శివాలెత్తించే 'నైటు క్లబ్బు'ండాల
గోవా బీచ్‌లో ఐదు నక్షత్రాల హోటలుండాల
విజయవాడలో 'నైజాంమీల్స్' హోటలు
హైదరాబాద్‌లో 'గుంటూరువారి భోజనం మెస్సు'
అనంతపురంలో 'నైజాం-గుంటూరివారి భోజనం రెడీ'
బోర్డులు కావాల
మరి తెలుగువాడా! ఏది నీ వాడ?
తెలుగునాట ప్రభవించిన సంపదలెక్కడ?
తెలుగునాట ధ్వనియించిన సాహితీ తరంగాలు ఎక్కడ?
తెలుగువాడా! ఏది నీ వాడ?
దీపం చుట్టూ చీకటిలా – తెలుగువాడా! తెలుగువాడా!!
నీ చుట్టూ చీకటి! పరమ ప్రాంతీయతత్త్వ చీకటి!!
ఎవడు పోగొట్టాలి? ఎవడు సమైక్య దీపాన్ని రక్షించాలి??
ఎవడు నీ మనస్సు తమస్సును విదిలించాలి? తెలుగువాడా! ఏది నీ వాడ?
తెగులు వదిలించుకుని జాగ్రత్త చేసుకో నీ జాడ.

– డా॥ నాగినేని భాస్కరరావు

అనుకరించడం మీకు సాధ్యమైందండీ అని ఆసక్తికరంగా నేనడిగాను. "అదేనండీ.. ఆ పాటే నాచేత మిమిక్రీకి అర్థం చెప్పించింది. 1978 ఆరోతరగతి చదివే సమయంలో "అంతులేని కథ" సినిమాలోని ఆ పాటను విన్నాను. వాయిద్యాలన్నీ ఒకరే చేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్నాను. అప్పటి నుంచీ అదేపాటను అనుకరించడం మొదలెట్టాను. 1979లో కర్నూలు లలితకళాసమితిలో అదేపాటను స్టేజీపై పాడి వాయిద్యాలేమీ లేకుండా నా నోరే వాయిద్యాలుగా మార్చాను. అప్పుడు వచ్చిన టార్చిలైటు ప్రైజు నాలో ఉన్న మిమిక్రీ ఆసక్తిని పెంచింది. ఆ టార్చి లైటే నాకు మంచి గుర్తింపు తెచ్చింది.'' అంటూ మళ్ళీ ఇప్పటి పరిస్థితిలోకి వచ్చినట్లు ఫీలయ్యాడు. మళ్ళీ జురాసిక్ పార్కులోని డైనోసార్ సీన్‌ను అప్పుడే తన నోటి ధ్వనితో చేసి చూపించాడు. తనకు అందుబాటులో ఎటువంటి సౌండ్ సిస్టం ఉన్నా కలెక్టరేట్ అంతా ఒక్క సారిగా ఉలిక్కిపడునేమో అనిపించింది. ఈ లోపు మాకు సుమారు గంట సమయం పైగానే గడిచిపోయింది. అంతలోపు ఆయనకోసం ఎంతమందో వస్తూనే ఉన్నారు. వాళ్ళకు కావలసిన సమాచారం అందిస్తూనే మాకు చెప్పాల్సింది చెబుతూనే ఉన్నాడు. అంతటితో ఆగాడా..! లేదు. వెంటనే సినిమాల్లో బ్యాంకు దొంగతనం చేసినపుడు పరిస్థితిని ఆ నోటితోనే ధ్వని శబ్దంతో వినిపించాడు. ఇక నేనుండలేక ఆయన వివరాలు కనుక్కోవాలని ప్రయత్నించాను. ఇంతకీ మేమెళ్ళిన పని మీద దృష్టి మరల్చకుండానే కలెక్టర్ సమాచారం తెలుసుకుంటూనే ఈ కళాకారుడి గురించి కూడా చాలా విషయాలు తెలుసుకున్నాం.

ఇంతసేపూ అక్కడే కూర్చొని బాతాఖానీ కొడుతూంటే ఎవరూ అభ్యంతరం తెలపలేదు తెలుసా మరి. ఎందుకంటే మేము మాట్లాడే వ్యక్తే అక్కడ కీలకమైన వాడు. ఎవరంటే ఆయనే ***జిల్లా కలెక్టర్ క్యాంపు క్లర్కు***. పేరు **గొల్లాపిన్ని అంజన్ బాబు**. కలెక్టరేట్‌లో అతనిది చిరుద్యోగమైనా మిమిక్రీలో అతని ప్రతిభ ప్రశంసనీయం. మంచి మంచి వాయిద్య, వింత శబ్దాలను అనుకరించడమే ఆయన పని. తనకుగల మిమిక్రీ కళ ద్వారా స్టేట్ రెవెన్యూ సర్వీసెస్‌లో మంచి పరిచయాలు సంపాదించాడు.

ఇప్పటికి సుమారు వందకు పైగా ప్రోగ్రాములు ఇచ్చినట్లు అంజన్ బాబు చెప్పారు. తన కళకు నిజమైన ఆదరణ లేదని వాపోయారు. తనకు ఖాళీగా ఉన్న సమయాల్లో ఇటీవల నగరంలోని ఒక పాఠశాలలో తానిచ్చిన డైనోసార్ శబ్దానికి అక్కడి విద్యార్థులు తనను అల్లుకుపోయినట్లు వివరించారు. ప్రముఖ మిమిక్రీషియన్ హరికిషన్ కేవలం 10 సంవత్సరాల్లో అంత గుర్తింపు తెచ్చుకోవడానికి కారణం తనకున్న కళను ప్రచారం చేసుకోవడం వల్లనే సాధ్యమైందన్నారు. తనకూ హరికిషన్ ప్రోగ్రాంలో ఒకసారి అవకాశమిచ్చి చూస్తే తన సత్తా ఏమిటో చూపిస్తానంటున్నారు. మరి కర్నూలులో ఇంతటి గొప్పకళాకారులున్నా బయటనుంచి వచ్చే కళాకారులకిచ్చే గుర్తింపు సొంత ఊరిలో తనలాంటి వారికి ఇవ్వనందుకు చింతిస్తునాడు. వెతికి చూస్తే రాష్ట్ర స్థాయిలో కర్నూలుకు గుర్తింపు తేగల సమర్థులు నగరంలో ఉన్నారని వివరించారు.తగిన ఆదరణ లేకనే కళాకారుల ఉనికి కనుమరుగవుతోందంటూ వాపోయారు.



డెడ్; ఎలైవ్ పదాలతో రూపొందిన బిన్ లాడెన్ బొమ్మ

చచ్చినా, బతికినా "వాంటెడ్ పర్సన్" అన్నా ... బిన్ లాడెన్ బతికుంటేనే బుష్‌గారి యుద్ధం ఆటలు సాగేది.

(అమెరికా నుంచి ఇ-మెయిల్ ద్వారాఅందిన గ్రాఫిక్)

బతుకును కరిచే కరువు

ప్రపంచీకరణ పడగ కింద
అందాలరాణులకు మాతృత్వమే కరువు
పూరి గుడిసెలోని పసివాడికి అమ్మ ఒడియే కరువు
ధనవంతుడికి మనశ్శాంతి
పేదవాడికి కడుపునిండా తిండి
కష్టపడి చదివిన వాడికి ఉద్యోగం
చదువు'కొన్న' వాడికి విజ్ఞానం కరువు
ప్రపంచీకరణ పడగ నీడన
ఉమ్మడి కుటుంబాల్లో ఐకమత్యం
వ్యక్తిగత కుటుంబాల్లో అవగాహన కరువు
రైతన్నకు గిట్టుబాటు ధర
కమీషన్ వ్యాపారికి కమీషన్
నాగరికత వ్యామోహంతో బంధాలు -
బంధుత్వాలు
పెరుగుతున్న కాలుష్యంలో ప్రకృతీ పచ్చదనం
కరువు, కరువు, కరువు
ప్రపంచీకరణ పడగ చాటున
టెలిఫోన్ మూగబోయినా, టెలివిజన్
ఊరకుండినా
ప్రపంచ విశేషాలే కరువు
కంప్యూటర్ యుగంలో నిస్వార్థ ప్రేమకరువు
నిజమైన ప్రేమికులకు అండదండలు కరువు
ద్వేషం తెలియని ప్రేమమయులకు స్వచ్ఛమైన
చేయూత కరువు
సకాలంలో వర్షాలు కురవకుంటే అందరికీ తిండి కరువు
నేస్తం.... కరువే కరువైతే లోకమే సుభిక్షం

- వనపర్తి పద్మావతి

న్యాయసలహాలు



జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది.

కోర్టుకెళ్ళకుండా...చెప్పిచూడండి

నా స్నేహితురాలు ఆమె భర్త ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. ఆమె తమ భర్యా భర్తల పేరున 2.30 లక్షలు ఆర్.డి.లు కట్టించగా ఆ వచ్చిన మొత్తాన్ని తన భర్తకు తెలియకుండా తన తండ్రి, తమ్ముని సహాయంతో స్థలం కొనుగోలు చేసింది. ఈ సొమ్ము వారి ఇద్దరి జీతాల నుండి మిగిలిన డబ్బు. వాటితో స్థలం కొనుగోలు చేసింది. దానితో కాపురంలో గొడవలు వచ్చి తన పుట్టింటి నుండి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించుచున్నది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. పిల్లల్ని వదిలి వెళ్ళిపోతే ఆమె భర్త, తన నాయనమ్మను పెట్టుకొని పిల్లల్ని చదివించుకొనుచున్నాడు. ఇప్పుడు భర్తకు తెలియకుండా మూడు లక్షలు లోన్ తీసుకొని ఇల్లు కట్టే ప్రయత్నంలో ఉంది. మా ఇద్దరి సొమ్ములు కనుక నాకు తెలియకుండా శంకుస్థాపన చేసింది. ఇప్పుడు ఇల్లు ఎలా కడుతుందో చూస్తాను కోర్టు ద్వారా స్టే తెస్తాను అని అంటున్నాడు. ఈమె తన భర్తకు తెలియకుండా ఇల్లు కట్టవచ్చా? అతను మాత్రం నాకు తెలిసి చాలా మంచివాడు. తన జీతంలో ముందు అన్ని ఖర్చులు తెస్తాడు. ఆమెకు వచ్చిన జీతం కూడా తన భర్తకే ఇచ్చేది. తన మంచితనంతో ఆమె పేరునే నాలుగు ఆర్.డి.లు కట్టించాడు. చిన్న గొడవ వలన తనకు తెలియకుండా స్థలం కొని, రిజిస్ట్రేషన్, శంకుస్థాపన చేయించింది. ఇది తప్పని నేను ఎంత చెప్పినా తను వినలేదు. ఇప్పుడు విడిపోయి మూడు నెలలు అయ్యింది. పిల్లల కొరకు తను ఆమెను రమ్మన్నాడు. రెండు ఉత్తరాలు రాశాడు. నేను రాను లీగల్‌గా వస్తాను అని తెలియజేసింది. ఈమె లీగల్‌గా వెళ్ళాలి. తప్పు చేసినా నా ఫ్రెండ్ కదా. తగిన సలహా ఇవ్వగలరని ఆశిస్తున్నాను.

- ఆర్.రేవతి, కైకలూరు

భార్యాభర్తలు కుటుంబానికి చక్రాలవంటి వారు. ఇద్దరి మధ్యలో మనస్పర్థలు, అపనమ్మకాలు చోటు చేసుకుంటే జీవితాలు అధోగతే. అతడి నమ్మకాన్ని మీ స్నేహితురాలు వమ్ము చేయాల్సిన పరిస్థితి ఎందుకు దారితీసిందో తనకే తెలియాలి. తన పేరు మీద రాసినంత మాత్రాన తాను ఆ డబ్బును భర్త మెప్పుతో మంచి పని చేస్తే మంచిదే. ఇల్లు కట్టడంలో తప్పులేదు. ఎవరు సంపాదించినా చివరికి ఆ ఆడపిల్లల కోసమే గదా! ఆ విషయాన్ని వారిద్దరూ అర్థం చేసుకునేలా చెప్పి చూడండి. భార్య తన పేరిట కొని తన పేరున లోన్ తీసుకుని కట్టబోతున్నది కావున ఇవి భర్త తన డబ్బులు అని నిరూపించలేడు. భర్తకు ఆ ఇంటితో ఏ విధంగాను సంబంధం ఉండదు. కోర్టు కూడా ఏ విధంగానూ జోక్యం చేసుకోలేదు. అదే పనిని భర్తను ఒప్పించి ఇల్లు కట్టుకుంటే ఆ కుటుంబంలో తగాదాలకు తావు లేదు. మీ స్నేహితురాలికి ఆ విషయం చెప్పి ఒప్పించగలిగితే మంచిది. తాను కుటుంబం, పిల్లలు, వారి భవిష్యత్తు గురించే ఆలోచించేది అయితే మీ స్నేహితురాలు వెంటనే పిల్లలు, భర్త వద్దకి వెళ్ళాల్సిందే.

సుప్రీంకోర్టులో పెండింగ్

నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. ఒక ప్రభుత్వ సంస్థలో డైలీవేజర్‌గా చేరాను. 1997వ సంవత్సరం పై కోర్టులో కేసు వేశాము. 2002 సంవత్సరంలో రెగ్యులరైజ్ చెయ్యమని, ఫుల్‌శాలరీ ఇవ్వమని హైకోర్టు నుండి తీర్పు వచ్చింది. కాని రెగ్యులర్ చేయలేదు. హైకోర్టు నుండి ఫైనల్స్ డిపార్టుమెంటు వారు మాపై సుప్రీంకోర్టులో లీవు పిటీషన్ వేశారు. మేము పిటిషన్‌కు హాజరైనాము. ఇది జరిగి సంవత్సరం అయినది. మాకు ఎటువంటి రిప్లై రాలేదు. మా ఉద్యోగాలు పర్మినెంట్ అవుతుందా లేదా అనే అయోమయంలో పడ్డాం. చాలీచాలని జీతం. అదికూడా ప్రతినెలా రావు (ఇవ్వరు). ఐదారు నెలలకు ఇస్తారు. ఊరుకాని ఊరిలో ఇంటి అద్దెలతో పాలవారి గోలతో చిల్లర దుకాణదారులతో మేము పడే బాధ అంతా ఇంతా కాదు. మా బాధలు తీరే మార్గం చెప్పండి.

- ఒక సహోదరుడు, గుంటూరు.

మీకు అనుకూలంగా 2002లో తీర్పు వచ్చిందన్నారు. కాని రెగ్యులరైజ్ చేయమని, సింగిల్ బెంచ్ తీర్పునిచ్చింది. దానిని గవర్నమెంటు వారు డబల్ బెంచీలో అప్పీలుకి వెళ్ళనందున ఇక్కడి ఎ.పి. హైకోర్టు కొట్టివేయబడింది. దీంతో రెగ్యులరైజ్ చేయమని మీలాంటి ఉద్యోగులందరు సుప్రీంకోర్టుకెళ్ళినా అది పెండింగ్‌లో ఉంది. మీరేమో హైకోర్టు మీకనుకూలంగా వచ్చిందంటున్నారు. మీ న్యాయవాదినడిగా ఏం జరిగిందనేది తెలుసుకోండి. మీ ఉద్యోగం పర్మినెంట్ చేయడమనేది సుప్రీంకోర్టు తీర్పును బట్టి ఉంటుంది.

అటెండర్ ఉద్యోగాలేనా?

నేను ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలో అటెండర్‌గా పని చేస్తున్నాను. నేను 1997 జనవరిలో జి.ఓ.నెం.281 ద్వారా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరాను. నేను ఉద్యోగంలో చేరేటప్పుడు బి.కామ్. డిగ్రీతో పాటు బి.ఇడి. అర్హతలున్నాయి. నాకు సెకండరీ గ్రేడ్ టీచర్‌గాను లేక స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఉద్యోగాలు ఇవ్వమని గత ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వానికి ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. నేను ఇప్పుడు ఎమ్.టెక్ మార్చి 2004లో పాసయ్యాను. కాబట్టి నేను లెక్చరర్ ఉద్యోగం ఇవ్వమని ప్రస్తుత ప్రభుత్వానికి దరఖాస్తు చేశాను. ఫలితం లేదు. నేను ఉద్యోగంలో చేరేటప్పుడు డిగ్రీతో పాటు బి.ఇడి. అర్హతలున్న నాకు టీచర్ ఉద్యోగం ఇవ్వకుండా అటెండరు ఉద్యోగం ఇచ్చారు. నాకు చాలా అన్యాయం జరిగింది. కాబట్టి ప్రభుత్వం నుండి నష్టపరిహారం పొందవచ్చా? కారుణ్య నియామకాలు జి.ఓ.నెం.281 ద్వారా ఇచ్చే ఉద్యోగాలు అటెండరు మాత్రమే ఇస్తారా? మాకు న్యాయం జరగదా?

- షేక్‌జాని భాషా, అటెండరు, గుంటూరు

మీరు ఎయిడెడ్ కాలేజి ఉద్యోగి మాత్రమే కాని గవర్నమెంట్ ప్రత్యక్ష ఉద్యోగి కాదు. కారుణ్య నియమాకం ద్వారా ఉద్యోగంలో చేరారు. పత్యక్షంగా మీ అర్హతలతో సంబంధం లేని ఉద్యోగం అది. అక్కడ ఖాళీలను బట్టి కూడ ఉంటుంది. ప్రభుత్వం నుండి మీరు ఎలాంటి నష్టపరిహారం పొందజాలరు.

హ్యాపీ బర్త్‌డే

(17-10-2004 నుంచి 23-10-2004 వరకు)

జె. మహతి
1సం॥, 21.10.2003
సమత-జయరాం
ముషీరాబాద్-హైదరాబాద్



ఎ. అరుణ్ చారి
9సం॥, 21.10.1995
పద్మ-కృష్ణచారి
శ్రీరాంనగర్-రంగారెడ్డి



జి. వెంకటరత్న
2సం॥, 21.10.2002
సుజాత-వెంకటేష్
నారాయణపేట-మ॥నగర్

సిహెచ్. వాసవీగౌడ్
3సం॥, 21.10.2001
కనకదుర్గ-పుల్లయ్యగౌడ్
ఖమ్మం

టి. రోషిణి
అక్టోబర్-21
సుమలత-రవీందర్
మడికొండ-వరంగల్

ఫల్గుణ్
1సం॥, 22.10.2003
నాగమణి-హరిప్రసాద్
పటమట-విజయవాడ

సి.ఎస్. ముకుంద్
4సం॥, 23.10.2000
హేమమాలిని-సౌందర్‌రాజ్
మల్కాజ్‌గిరి-హైదరాబాద్

జి. మేఘన
1సం॥, అక్టోబర్-2003
అనిత-మురళి
అఫర్‌ఘడ్-వరంగల్

జి సోన
అనితారాణి-సుందర్‌కుమార్

జి. అమ్ములు
1సం॥, అక్టోబర్-2003
సురేఖ-భిక్షపతి
బాలాపురం-రంగారెడ్డి

సిహెచ్. హేలాకృష్ణ
3సం॥, అక్టోబర్-2001
వసుంధర-మల్లిఖార్జున్‌రావు
బోరబండ-హైదరాబాద్

సూర్య ప్రశాంత్ కుమార్
8సం॥, అక్టోబర్-1996
జయశ్రీ-వెంకటేశ్వరరావు
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

కె. రమ్య
10సం॥, అక్టోబర్-1994
లలిత-సోమేశ్వర్
పాలకుర్తి-వరంగల్

లక్ష్మీదుర్గ
6సం॥22.10.1998
అంజలి-రాజారావు
విజయవాడ-కృష్ణా

టి. వైష్ణవి
6సం॥, అక్టోబర్-1998
మునెమ్మ-దొరయ్
పుంగనూర్-చిత్తూరు

కె.ఉదయ్‌రాయ్(చిన్న)
2సం॥, అక్టోబర్-2002
మంగ-రామారావు
గొల్లవీధి-విశాఖపట్నం

బి. వీర సౌజన్య
1సం॥, అక్టోబర్-2003
విజయలక్ష్మి-సుబ్బరాయుడు
కొత్త బోయనపల్లె-కడప

వైష్ణవి
1సం॥, అక్టోబర్-2003
మహాలక్ష్మి-ఆంజనేయులు
తిరుపతి-చిత్తూరు

శ్రీహిత
అక్టోబర్-19
హేమంత్‌కుమార్
మోహన్‌నగర్-హైదరాబాద్

రుచి

మైసూర్ వడ

కావలసిన వస్తువులు:

మినప్పప్పు	:	పావు కిలో
శనగపప్పు	:	అర కిలో
పెసరపప్పు	:	అర కిలో
నూనె	:	అరకిలో
అల్లం	:	చిన్న ముక్క
ఉప్పు	:	తగినంత
మిరియాలు	:	10
జీలకర్ర	:	కొంచెం
పచ్చిమిరపకాయలు	:	5

తయారుచేసే పద్ధతి:

మినప్పప్పు, శనగపప్పు, పెసరపప్పు వేరువేరుగా నానబెట్టుకోవాలి. మినప్పప్పు శుభ్రంగా కడిగి బాగా మెత్తగా రుబ్బుకోవాలి. మిరపకాయలు ఈ పిండిలోనే వేసి రుబ్బాలి. శనగపప్పు, పెసరపప్పును దేనికవి కచ్చాపచ్చాగా రుబ్బి ఇందులో కలపాలి. మిరియాల పొడి, అల్లం ముక్కలు ఈ పిండిలో కలపాలి. బాండీలో నూనె పోసి కాగిన తరువాత ఈ పిండిని గుండ్రంగా వడలలాగా చేసుకొని నూనెలో వేయాలి. ఎర్రగా వేగిన తరువాత తీసుకోవాలి.

బెల్లంతో చక్రాలు

కావలసిన వస్తువులు:

బియ్యప్పిండి	:	ఒక కిలో
బెల్లం	:	అర కిలో
మినప్పప్పు	:	పావు కిలో
నూనె	:	ఒక కిలో
యాలకులు	:	4
వెన్న	:	50 గ్రాములు

తయారుచేసే పద్ధతి:

ముందుగా మినప్పప్పు శుభ్రంగా రాళ్ళు లేకుండా చేసుకొని కుక్కర్లో పెట్టి మెత్తగా ఉడికించాలి. వీటిని మిక్సీలోవేసి మెత్తగా రుబ్బుకోవాలి. దీనిని బియ్యప్పిండిలో వేసి కలపాలి. బెల్లం సన్నగా తరిగి ఇందులో కలపాలి. యాలకుల పొడిని, వెన్నను కూడా కలపాలి. స్టౌ మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. నూనెకాగిన తరువాత లావు చక్రాల గిద్దల్లో పిండి పెట్టి వత్తుకోవాలి. ఇవి కరకరలాడుతూ తియ్యగా బాగుంటాయి. ఎక్కువ నూనె పీల్చవు. తక్కువ ఖర్చుతో అయిపోతాయి.